శుక్ర వారం
10-11-2023
సంపుటి - 08,
సంచిక - 384
పేజీలు - 4
వెల రూ. 5/-
Telangana
Andhra Pradesh

CEO & Editor : G. PRUDHVIRAJ

RNI NO: TELTEL/2016/73311

www.samasamajam.in

# సమ సమాజం

SAMA SAMAJAM TELUGU DAILY

తెలుగు వార్త పత్రిక

❍ Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Warangal, Medak, Karimnagar, Kammam, Vishakapatnam, Vijayawada, Ongole

## డిసెంబర్‌లో పార్లమెంట్ శీతాకాల సమావేశాలు !



**న్యూఢిల్లీ, నవంబర్ 9 (సమ సమాజం):** పార్లమెంటు శీతాకాల సమావేశాలు డిసెంబర్ రెండో వారంలో మొదలవుతాయని సమాచారం. డిసెంబర్ 3న ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడ నుండటం తెలిసిందే. ఆ తర్వాత కొద్ది రోజులకే పార్లమెంటు సమావేశాలు మొదలవుతాయని, డిసెంబర్ 25న క్రిస్మస్‌కు ముందు ముగుస్తాయని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. భారతీయ శిక్షా స్మృతి, నేర శిక్షా స్మృతి, సాక్ష్యాధారాల చట్టాల స్థానంలో స్టాండింగ్ కమిటీ ఇటీవలే ఆమోదించిన కొత్త చట్టాలు ఈ సమావేశాల్లో పార్లమెంటు ముందుకు రానున్నాయి. కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్, ఎన్నికల కమిషనర్ల నియామక బిల్లు సైతం పార్లమెంటు వద్ద పెండింగ్‌లో ఉంది. శీతాకాల సమావేశాలు సాధారణంగా నవంబర్ మూడో వారంలో మొదలై క్రిస్మస్ ముందు ముగియడం ఆనవాయితీగా వస్తోంది.

## నామినేషన్ పత్రాలను సమర్పించిన సిఎం కేసీఆర్



**సిద్దిపేట, నవంబర్ 9 (సమ సమాజం):** గజ్వేల్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి మూడోసారి పోటీ చేస్తున్న బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్ తన నామినేషన్ పత్రాలను ఆర్వో కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారికి సమర్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు. ఎర్రవల్లి నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో గజ్వేల్‌కు వెళ్లారు కేసీఆర్. నామినేషన్ దాఖలు అనంతరం గజ్వేల్ నుంచి హెలికాప్టర్‌లో కామారెడ్డికి కేసీఆర్ బయల్దేరారు కేసీఆర్. అక్కడ మధ్యాహ్నం 2 గంటల లోపు కేసీఆర్ నామినేషన్ దాఖలు చేశారు. అనంతరం అక్కడ నిర్వహించే బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభలో కేసీఆర్ పాల్గొని ప్రసంగించారు. కేసీఆర్ ప్రసంగం

4వ పేజీలో...

## ఆర్మూర్ ప్రచారంలో అపశృతి

### ప్రచార రథంపై నుంచి కిందపడ్డ కెటిఆర్



**ఆర్మూర్, నవంబర్ 9 (సమ సమాజం):** ఆర్మూరు అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో ప్రమాదం చోటుచేసుకుంది. ప్రచార రథం రెయిలింగ్ విరగడంతో మంత్రి కేటీఆర్ ప్రచారం రథంపై నుంచి కిందపడ్డారు. మంత్రి కేటీఆర్‌తోపాటు ఎంపీ సురేష్‌రెడ్డి, ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి కూడా ప్రచార రథంపై నుంచి కిందపడ్డారు. ఈ ప్రమాదంలో మంత్రికి, ఇతర నేతలకు స్వల్ప గాయాలయ్యాయి.ప్రచారం రథం నడుపుతున్న వ్యక్తి ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో వాహనం రెయిలింగ్ విరిగిపోయింది. దాంతో నేతలకు పట్టుదొరకక కింద పడిపోయారు. ప్రచార రథం రెయిలింగ్ విరగగానే భద్రతా సిబ్బంది పట్టుకోవడంతో నేతలకు పెను ప్రమాదం తప్పింది.

## పది రాష్ట్రాల్లో ఎన్ఐఏ దాడులు

**న్యూఢిల్లీ, నవంబర్ 9 (సమ సమాజం):** దేశవ్యాప్తంగా 10 రాష్ట్రాల్లో ఎన్ఐఏ దాడులు నిర్వహించింది. మానవ అక్రమ రవాణాతో సంబంధమున్న 44 మందిని అరెస్ట్ చేసింది. సరిహద్దు భద్రతా దళం, రాష్ట్ర పోలీసులతో కలిసి దాడులు నిర్వహించినట్లు ఎన్ఐఏ అధికారి ఒకరు తెలిపారు. ఇండో-బం గ్లాదేశ్ సరిహద్దు ద్వారా దేశంలోకి చొరబాట్లు, అక్రమ వలసలు, మానవుల అక్రమ రవాణా జరుగు తున్నదని, దీని నిరోధంలో భాగంగా ఈ దాడులు చేసినట్టు చెప్పారు. దేశవ్యాప్తంగా తెలంగాణ, త్రిపుర, హర్యానా, రాజస్థాన్, తమిళనాడు, పుదుచ్చేరి, జమ్ము-కశ్మీర్ తదితర రాష్ట్రాలు, యూటీ ల్లోని 55 ప్రదేశాల్లో తనిఖీలు, దాడులు చేశామన్నారు.




## సారీ చెప్పిన బీహార్ సీఎం నితీష్ కుమార్



**పాట్నా, నవంబర్ 9 (సమ సమాజం):** జనాభా నియంత్రణపై బీహార్ సీఎం నితీశ్‌కుమార్ చేసిన వ్యాఖ్య లు దేశవ్యాప్తంగా తీవ్ర దుమారం రేపిన విషయం తెలిసిందే. పలు రాజకీయ పార్టీల నేతలు ఆయన వ్యాఖ్యల్ని తీవ్రంగా ఖండించారు. ఈ వ్యవహారం రాజకీయంగా చర్చనీయాంశం కావటంతో సీఎం నితీశ్‌కుమార్ నష్టనివారణ చర్యలకు దిగారు. 'నా మాటల్ని వెనక్కి తీసుకుంటున్నా. నా వ్యాఖ్యలు ఎవరినైనా బాధించి ఉంటే క్షమాపణలు తెలుపుతున్నా. జనాభా నియంత్రణలో విద్య ముఖ్యపాత్ర పోషిస్తుందని చెప్పటం నా

4వ పేజీలో...

## జమ్ము కశ్మీర్‌లో ఎన్‌కౌంటర్.. ఉగ్రవాది హతం

**శ్రీనగర్, నవంబర్ 9 (సమ సమాజం):** జమ్ముకశ్మీర్‌లోని షోపియాన్‌లో భద్రతా బలగాలు, ఉగ్రవాదుల మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో ఓ టెర్రరిస్టు హతమయ్యాడు. గురువారం షోపియాన్‌లోని కతోహలెన్ ప్రాంతంలో ఎన్‌కౌంటర్ ప్రారంభమైంది. ఈ సందర్భంగా జరిగిన కాల్పుల్లో ఓ టెర్రరిస్టును మట్టుబెట్టామని కశ్మీర్ జోన్ పోలీసులు తెలిపారు. అతడిని ద రెసిస్టెన్స్ ఫ్రంట్ ఉగ్రసంస్థకు చెందిన ఉగ్రవాదిగా గుర్తించామని వెల్లడించారు. ఘటనా స్థలంలో ఆయుధాలు, యుద్ధ సామాగ్రిని స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. మరో ఘటనలో రామ్‌గఢ్ సెక్టార్‌లోని అంత



4వ పేజీలో...

# కామారెడ్డిని బంగారు తునక చేస్తా


- కెసిఆర్ వస్తే ఒక్కడే రాడు..అనేకం వస్తాయ్
- నేనేం చేస్తానో రేపురేపు మీరే చూస్తారు
- 50 లక్షలతో పట్టుబడ్డోడు..నాపై పోటీ చేస్తాడట
- ధరణిని వద్దనోటల్లను..కరెంట్ తీసేటోళ్లను ఓడించాలి
- అలాంటోడు కావలో..నేను కావాలో తేల్చుకోవాలి
- తెలంగాణను ఆగం చేసేందుకు వచ్చే వాళ్లతో జాగ్రత్త
- కామారెడ్డిలో నామినేషన్ వేసిన కెసిఆర్
- ప్రజాశీర్వాద సభలో కాంగ్రెస్, బిజెపిలను ఏకిపారేసిన కెసిఆర్
- కామారెడ్డితో నా అనుబంధం విడదీయరానిది
- మా అమ్మ పుట్టిన గడ్డ ఇదే..పుట్టుక నుంచే నాకు బంధం
- తెలంగాణ పోరాటంలో ఇక్కడే జలసాధన ఉద్యమం
- గులాబీ సైనికుడిగా ఇక్కడి నుంచే పోరాటం చేసా
- తెలంగాణ రాకముందు..ఇప్పుడు ఎలా ఉందో చూడాలి
- గంపగోవర్ధన్ రాజకీయ భవిష్యత్ కల్పిస్తా
- కామారెడ్డి ప్రజాశీర్వాద సభలో సిఎం కెసిఆర్




**కామారెడ్డి, నవంబర్ 9 (సమ సమాజం):** కామారెడ్డితో తనకు గట్టి అనుబంధం ఉందని..అందుకే ఇక్కడి నుంచి పోటీచేస్తున్నానని సిఎం కెసిఆర్ అన్నారు. 50లక్షలతో పట్టుబడ్డ వాడే నాతో పోటీ కొస్తాడట..ఇక వాని సంగతి మీరే చూడాలని పిలుపునిచ్చారు. అలాగే ప్రధాని నరేంద్రమోదీ, కేంద్రంలోని బీజేపీ సర్కారుపైన సీఎం కేసీఆర్ నిప్పులు చెరిగారు. బీజేపీ, ప్రధాని మోదీ తెలంగాణకు అన్యాయం చేశారని ఆరోపించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో గజ్వేల్‌తోపాటు కామారెడ్డి నుంచి కూడా బరిలో దిగుతున్న సీఎం కేసీఆర్.. కామారెడ్డిలో నామినేషన్ వేసిన అనంతరం అక్కడ జరిగిన ప్రజా ఆశీర్వాద సభలో ప్రసంగించారు. వచ్చిన తెలంగాణను వచ్చిన్నం చేయడానికి టీఆర్ఎస్ పార్టీని అస్థిరం చేయడానికి వచ్చి ఎవడైతే 50 లక్షల నగదుతో దొరికిండో.. ఆయన్నే తీసుకొచ్చి ఇవాళ కేసీఆర్ మీద పోటీకి పెడతరంట. దీనిమీద కామారెడ్డి ప్రజలు తీర్పు చెప్పాలి. ఆ బాధ్యత మీ మీద ఉంది.' అని సీఎం కేసీఆర్ అన్నారు. ఆలోచించి.. విచక్షణ చేసి ఎవరి ప్రవర్తన ఏంటనేది చూసి ఓటేయాలని సూచించారు. కేసీఆర్‌తో పాటు కామారెడ్డికి కూడా పరిశ్రమలు, ఐటీ రంగం కూడా వస్తాయన్నారు. కేసీఆర్ ఒక్కడు రాడు.. కేసీఆర్ వెంబడి చాలా వస్తాయని చెప్పారు. ఇప్పుడు చెబితే నరికినట్టు అయితది.. రేపు అందరికి కనబడ్తదని అన్నారు. కామారెడ్డి నియోజక వర్గాన్ని బంగారు తునకలా తయారు చేసి మీకు అప్పగిస్తా అని హామీ ఇచ్చారు. తాను కామారెడ్డి నుంచి పోటీ చేస్తే ఈ నియోజకవర్గ రూపురేఖలే మారిపోతాయని చెప్పారు. ఏడాదిన్నర, రెండేళ్లలో కామారెడ్డి, ఎల్లారెడ్డి నియోజకవర్గాలకు బ్రహ్మాండంగా నీళ్లు తెచ్చి చూపిస్తానని, ఇది నా వాగ్దానమని సీఎం శపథం చేశారు. కాబట్టి ప్రజలు ఎవరికి ఓటు వేస్తే మేలు జరుగతదో బాగా ఆలోచించి ఓటేయాలని ఆయన కోరారు. 'కేసీఆర్ వెంట చాలా వస్తయ్. విద్యుత్ సంస్థలు వస్తయ్. ఎడ్యుకేషన్ సంస్థలు వస్తయ్. పరిశ్రమలు వస్తయ్. మీరు ఊహించని అభివృద్ధి జరుగుతది. కామారెడ్డి

4వ పేజీలో...

## 97 ఏళ్ల వయసులోనూ కేసులు వాదిస్తున్నారు



**తిరువనంతపురం, నవంబర్ 9 (సమ సమాజం):** ఈ రోజుల్లో నలభై దాటితేనే నానా అనారోగ్యాలు వచ్చిపడుతున్నాయి. ఇక అరవై దాటితే ఇంట్లో రెస్ట్ తీసుకునే వారే ఎక్కువ. కానీ శతాయుష్షు సమీపిస్తున్నా ఒకాయన

4వ పేజీలో...

## దొరల గడీలను బద్దలు కొట్టడం ఖాయం

- డీలర్ దయాకర్..డాలర్ దయాకర్ అయ్యాడు
- ఇక్కడ దోచి..అమెరికాలో పెట్టుబడులు
- దయాకర్ కుట్రతోనే జైలుకు పంపించారు
- కాంగ్రెస్ అంటేనే నమ్మకం..బిఆర్ఎస్ అంటే అమ్మకం
- ఐటి దాడులతో కాంగ్రెస్‌ను భయపెట్టలేరు
- పాలకుర్తి ప్రచారంలో నిప్పులు చెరిగిన రేవంత్



**జనగామ, నవంబర్ 9 (సమ సమాజం):** పాలకుర్తి గడ్డకు ఒక చరిత్ర ఉందని.. పోరాట పటిమ ఉందని టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా పాలకుర్తిలో ఏర్పాటు చేసిన సభలో రేవంత్ మాట్లాడుతూ.. కాంగ్రెస్‌ను చూస్తుంటే దొరల

4వ పేజీలో...

## రాహుల్,వరుణ్ గాంధీల భేటీ

### తాజా రాజకీయాలపై ముచ్చట్లు..షికార్లు




**న్యూఢిల్లీ, నవంబర్ 9 (సమ సమాజం):** కాంగ్రెస్‌లో ఇందిర తరవాత సంజయ్ గాంధీదే ప్రధాన భూమిక. అయితే సంజయ్ అకాల మరణంతో రాజీవం గాంధీ అనివార్యంగా రాజకీయాల్లోకి వచ్చి

4వ పేజీలో...

## రాజకీయ పార్టీలతో సీఈఓ సమీక్షా సమావేశం

- పోలింగ్, కౌంటింగ్ అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్
- భారత ఎన్నికల సంఘం నిబంధనలు పాటించాలని సూచన
- లేదంటే చర్యలు తప్పవని హెచ్చరిక
- రిటర్నింగ్ అధికారులపై రాజకీయ పార్టీల ఫిర్యాదు
- నిబంధనలు పార్టీలే కాదు.. అధికారులు పాటించాలని విజ్ఞప్తి



**హైదరాబాద్, నవంబర్ 9 (సమ సమాజం):** తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ సమయం దగ్గర పడుతుండడంతో రాజకీయ పార్టీలతో సీఈఓ వికాస్ రాజ్ సమీక్షా సమావేశం నిర్వహించారు. నామినేషన్ల ఘట్టం పోలింగ్, కౌంటింగ్ అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు సీఈఓ.భారత ఎన్నికల సంఘం నిబంధనలు పాటించాలని, లేదంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇక, ఈ భేటీలో రిటర్నింగ్ అధికారులపై మూకుమ్మడిగా కంప్లయింట్ చేశాయి అన్ని రాజకీయ పార్టీలు. %జుజ×% నిబంధనలు పార్టీలే కాదు.. అధికారులు పాటించాలని విజ్ఞప్తి చేశాయి. రాష్ట్రంలో నామినేషన్ల ఘట్టం ముగిస్తున్న నేపథ్యంలో ఆయా రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించింది ఎలక్షన్ కమిషన్. CEO వికాస్ రాజ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ భేటీలో పోలింగ్, కౌంటింగ్ అంశాలకు సంబంధించిన కీలక సూచనలు చేశారు సీఈఓ వికాస్ రాజ్. ఎన్నికల వేళ ఆయా రాజకీయ పార్టీలు నడుచుకోవాల్సిన

4వ పేజీలో...

# సాలీడు కాటుతో ప్రముఖ సింగర్ మృత్యువాత!



బ్రసిలియా,నవంబర్ 9 (సమ సమాజం): ప్రముఖ బ్రెజిల్ సింగర్ డార్లిన్ మోరైస్ అనూహ్యంగా ప్రాణాలు కోల్పోయిన ఘటన విషాదాన్ని నింపింది. సాలీడు కారణంగా తీవ్ర అనారోగ్యానికి గురైన తీవ్రంగా పోరాడిన మోరైస్ చివరికి మృత్యువాత పడ్డాడు. ముఖంపై సాలీడు కుట్టడంతో చనిపోయాడని అత ని భార్య అతని భార్య జులెన్నీ లిసోబ స్థానిక మీడియాతో వెల్లడించింది. మోరైస్ భార్య జులినీ లి సోబ అందించిన వివరాల ప్రకారం సాలీడు కుట్టిన వెంటనే మోరైస్ శరీరంలో నిస్సత్తువ ఆవహించింది. ఆ తరువాత ముఖం ఉబ్బిపోయింది. గాయం కూడా నల్లగా మారిపోయి అలర్జీలా వచ్చింది. దీంతో అతడిని వెంటనే ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం ఈనెల 3న ఆస్పత్రి నుంచి డిశ్చార్జి చేశారు. కానీ మోరైస్ పరిస్థితి మెరుగు కాకపోవడంతో తిరిగి ఆదివారం పల్మాస్ జనరల్ ఆస్పత్రికి తరలించారు. మోరైస్‌ను కాపాడేందుకు వైద్యులు చేసిన ప్రయత్నాలు సఫలం కాకపోవ డంతో మోరైస్ సోమవారం తుదిశ్వాస విడిచాడని లిసోబ తెలిపింది. అంతేకాదు మోరైస్ సవతి కూతుర (18)ని కూడా సాలీడు కుట్టిందని, అయితే ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉందని తెలిపింది. దీనిపై మోరైస్ కుటుంబం ఇన్‌స్టాలో ఒక పోస్ట్ పెట్టింది. ఈ కష్టసమయంలో తమకు అండగా నిలిచిన ప్రతీ ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపింది. మ్స ప్రకారం, మోరైస్ 15 సంవత్సరాల వయస్సులో తన సంగీత వృత్తిని ప్రారంభించాడు. తనదైన స్టయిల్‌తో ఒక బ్యాండ్‌ను ఏర్పాటు చేసుకున్నాడు. ఇందులో సోదరుడు ,స్నేహితుడితో కూడిన ముగ్గురు సభ్యుల బ్యాండ్ టోకాం టిన్స్, గోయాస్, మారన్‌హావో, పారా రాష్టాల్లో విస్తృతమైన ప్రదర్శనలతో ఆకట్టుకునేది. ఎపుడూ సంతోషంగా, నవ్వుతూ నవ్విస్తూ ఉండే వాడని , నలుగురికీ సాయం చేసే వాడంటూ మోరైస్‌ను తలచుకుని కన్నీరు పెట్టుకున్నారు సమీప బంధువు వెస్లేయా సిల్వా. మోరైస్ ప్రతిభను గుర్తు చేసుకుంటూ తన సహచర గాయకుడికి స్నేహితులు నివాళులర్పించారు. ఇది ఇలా ఉంటే బ్రెజిల్‌లో, కొన్ని రాష్టాల్లో యాంటీ-వెనమ్ సీరమ్‌లు ఉత్పత్తి అవుతాని ఆరోగ్య సేవల్లో ఆరోగ్య మంత్రిత్వ శాఖ ద్వారా బాధితులకు ఉచితంగా అందిస్తామని తెలిపింది. డార్లిన్ మోరైస్ మరణా నికి గల కారణాలను దర్యాప్తు చేస్తున్నామని స్టేట్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ హెల్త్ తెలిపింది.

# నామినేషన్ దాఖలు చేసిన మంత్రి హరీశ్ రావు

### సిద్దిపేట వెంకటేశ్వర స్వామివారి ఆలయంలో మంత్రి హరీశ్ రావు ప్రత్యేక పూజలు



సిద్దిపేట, నవంబర్ 9 (సమ సమాజం): మంత్రి హరీశ్ రావు సిద్దిపేటలో నామినేషన్ దాఖలు చేశారు. సిద్దిపేటలోని ఆర్వో కార్యాలయంలో రెండు సెట్ల నామినేషన్ పత్రాలను సమర్పించారు. అంతకుముందు సిద్దిపేట వెంకటేశ్వర స్వామివారి ఆలయంలో మంత్రి హరీశ్ రావు ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి సన్నిధిలో నామినేషన్ పత్రాలపై సంతకాలు చేశారు. అనంతరం పట్టణంలో ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేసి ఆర్వో కార్యాలయానికి బయల్దేరారు. కాగా, మంత్రి హరీశ్ రావు 2004 నుంచి సిద్దిపేటకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఆ ఏడాది జరిగిన ఉప ఎన్నికల్లో 24,827 మెజార్టీతో విజయం సాధించారు. 2008 ఉప ఎన్నికల్లో 58,935 మెజార్టీతో గెలుపొందారు. అప్పటి నుంచి ప్రతి ఎన్నికల్లో తన మెజారిటీని పెంచుకుంటూ వెళ్తున్నారు. 2009లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 64,014 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. తెలంగాణ ఉద్యమంలో భాగంగా తన పదవికి రాజీనామా చేసిన ఆయన.. 2010లో జరిగిన ఉప ఎన్నికల్లో 95,858 ఆధిక్యంతో విజయం సాధించారు. ఇత తెలంగాణ ఏర్పాటు తర్వాత 2014లో అసెంబ్లీ ఎన్నికల్లో 93,328 ఓట్ల మెజారిటీ, 2018 ఎన్నికల్లో 1,18,699 మెజార్టీతో విజయం సాధించి ప్రత్యర్థి పార్టీలకు కనీసం డిపాజిట్ కూడా దక్కకుండా చేశారు.

## వనపర్తి నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి నిరంజన్ రెడ్డి నామినేషన్ దాఖలు



వనపర్తి,నవంబర్ 9 (సమ సమాజం): వనపర్తి నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి నిరంజన్ రెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. వనపర్తిలోని తన నివాసం నుంచి భారీ ర్యాలీగా వెళ్లిన మంత్రి నిరంజన్ రెడ్డి వనపర్తి ఆర్వో కార్యాలయంలో నామినేషన్ పత్రాలు సమర్పించారు. అంతకుముందు తన నివాసంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆర్వో కార్యాలయానికి ఎడ్లబండిపై బయల్దేరారు. ఈ సందర్భంగా వనపర్తి పట్టణంలో బీఆర్ఎస్ కార్యకర్తలు, అభిమానులు భారీ ర్యాలీ నిర్వహించారు. జనసందోహం నడుమ ఆర్వో కార్యాలయానికి చేరుకుని నామినేషన్ దాఖలు చేశారు. నిరంజన్ రెడ్డి.. 1999-2000 ఏపీ ఖాదీ బోర్డు చైర్మన్ పనిచేశారు. 2001 నుంచి 2014 వరకు బీఆర్ఎస్ పొలిట్ బ్యూరో సభ్యుడిగా, రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యుడిగా, మేనిఫెస్టో కమిటీ సభ్యుడిగా పనిచేశారు. 2014లో ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టారు. 2018 డిసెంబర్‌లో వనపర్తి అసెంబ్లీ నుంచి చిన్నారెడ్డిపై 51,685 ఓట్లతో ఎమ్మెల్యేగా ఎన్నికయ్యా రు. ఫిబ్రవరి 2019లో వ్యవసాయ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. మార్కెటింగ్, కో-ఆపరేషన్, ఆహారం, పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల మంత్రిగా కొనసాగుతున్నారు.

## నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారికి సమర్పించిన కేటీఆర్




రాజన్న సిరిసిల్ల, నవంబర్ 9 (సమ సమాజం): సిరిసిల్ల నియోజకవర్గం నుంచి ఎన్నికల బరిలో ఉన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ తన నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారికి సమర్పించారు. సిరిసిల్ల నుంచి కేటీఆర్ ఐదోసారి బరిలో నిలిచారు. నామినేషన్ దాఖలు కంటే ముందు కేటీఆర్ ప్రగతి భవన్‌లో ప్రత్యేక పూజలు చేసిన సంగతి తెలిసిందే. కేటీఆర్ రాజకీయ జీవితం 2006 నుంచి తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రధాన భూమిక పోషించారు. ఉద్యమ నాయకుడు కేసీఆర్ వెన్నంటి నడిచారు. మొదటిసారి 2009 అసెంబ్లీ ఎన్నికల్లో సిరిసిల్ల అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థిగా పోటీచేశారు. సమీప ప్రత్యర్థి కేకే మహేందర్‌రెడ్డిపై 171 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. తెలంగాణ కోసం ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి, తిరిగి 2010 ఉప ఎన్నికల్లో బరిలో నిలిచారు. సమీప ప్రత్యర్థి కేకే మహేందర్ రెడ్డిపై 68,219 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. 2014 జనరల్ ఎన్నికల్లో 53,004 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. తిరిగి 2018 ఎన్నికల్లో సమీప కాంగ్రెస్ అభ్యర్థి కేకే మహేందర్‌రెడ్డిపై 89,009 ఓట్ల భారీ మెజార్టీతో గెలిచి రికార్డు సృష్టించారు.

# పెంపుడు కుక్కల మార్కెట్ ఎంతో తెలిస్తే...!



న్యూ ఢిల్లీ, నవంబర్ 9 (సమ సమాజం): ఈ ఉరుకుల పరుగుల జీవితంలో రోజంతా పడిన శ్రమ మర్చిపోయేందుకు చాలా మంది పెంపుడు జంతువులను ఆశ్రయిస్తున్నారు. వాటిలో కుక్కల పిల్లలు ముందుంటాయి. మనం ఎంత టెన్షన్‌లో ఉన్నా వాటిని చూడగానే ఆ టెన్షన్ అంతా ఆవిరైపోతుంది. అయితే పెట్‌డాగ్స్ కొనుగోలు చేసినప్పటి నుంచి వాటి నిర్వహణ, ఫుడ్, వాటికి వేసే బట్టలు, వాటి కి వాడే క్యాస్టుమ్స్, వైద్యం..ఇలా పెట్ గ్రూమింగ్ నుంచి పెట్ ఫుడ్ సేల్స్ వరకు ప్రపంచవ్యా ప్తంగా కోట్ల వ్యాపారం సాగుతుంది. వచ్చే రెండేళ్లలో పెట్‌డాగ్స్ ద్వారా దేశంలో దాదాపు రూ.6వేల కోట్లు వ్యాపారం అభివృద్ధి చెందుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. పెంపుడు జంతువులకు స్నా నం చేయించడం, జుట్టు, గోళ్లను కత్తిరించడం, చెవులు శుభ్రం చేయడం వంటి సేవలు పెట్ గ్రూ మింగ్ సర్వీస్ కిందకు వస్తాయి. పెట్ సిట్టింగ్, డాగ్ వాకింగ్ సర్వీస్‌లో భాగంగా వాటి యజమానులు దూరంగా ఉన్నప్పుడు పెంపుడు జంతువులకు ఆహారం ఇవ్వడం, వాకింగ్ తీసుకెళ్లడం, ఆడించడం వంటివి ఉంటాయి. కొందరు ఆన్‌లైన్‌లో లేదా స్టోర్‌లో పెట్ ఫుడ్‌ను విక్రయిస్తున్నారు. స్టూడియోలో లేదా మంచి లొకేషన్‌లో వాటి యజమానుల కోసం పెంపుడు జంతువుల చిత్రాలను తీయడం కూడా వ్యాపారంగా మలుచుకుంటున్నారు. యజమానులు, ఇంటికి వచ్చేవారితో విధేయతతో ఎలా ఉండాలో కూడా పెట్స్‌కు శిక్షణ ఇస్తూ డబ్బు సంపాదిస్తున్నారు. యజమానులు రోజంతా పనిలో నిమగ్నమవుతుండడంతో వాటిని సంరక్షించే సమయం దొరకదు. అందుకు వీలుగా పెంపుడు జంతువుల డేకేర్ సెంటర్లను ఆశ్రయిస్తున్నారు. దేశవ్యాప్తంగా జరిగిన కొన్ని నివేదికల ప్రకారం.. ఇండియాలో ఏటా 6లక్షల పెంపుడు జంతువులను దత్తత తీసుకుంటున్నారు. వాటిలో ఎక్కువ భాగం కుక్కలు ఉన్నాయి. దేశంలో పెంపుడు జంతువుల మార్కెట్ రూ.2వేలకోట్లు పైగా ఉంది. పెట్ ఫుడ్ మార్కెట్ ఏటా 13.9? వృద్ధి చెందుతోంది. 2025 నాటికి దాదాపు రూ.6వేల కోట్లకు చేరుకుంటుందని అంచనా. ప్రపంచ వ్యాప్తంగా పెట్‌డాగ్స్ సంఖ్య ఈ కింది విధంగా ఉంది.

## బీఆర్ఎస్‌లోకి చేరిన సంభాని చంద్రశేఖర్



హైదరాబాద్,నవంబర్ 9 (సమ సమాజం): బీఆర్ఎస్‌లోకి వలసల పర్వం కొనసాగుతూనే ఉన్నాయి. అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీల నుంచి బీఆర్ఎస్‌లో వెల్లువలా చేరుతున్నారు. తాజాగా మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్ బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సంభాని చంద్రశేఖర్ ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ..తన 50 ఏళ్ల కాంగ్రెస్ జీవితానికి కాంగ్రెస్ పార్టీలో తనకు అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు, తాను ఖమ్మం జిల్లాతో పాటు సత్తుపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే సంద్ర వెంకట వీరయ్య గెలుపునకు కృషి చేస్తానని ఆయన తెలిపారు.

## వీల్ చైర్‌లో వెళ్లి ఆర్వో కార్యాలయంలో నామినేషన్ పత్రాలను సమర్పించిన కొత్త ప్రభాకర్ రెడ్డి



దుబ్బాక,నవంబర్ 9 (సమ సమాజం): బీఆర్ఎస్ అభ్యర్థి, ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి దుబ్బాకలో నామినేషన్ దాఖలు చేశారు. సికింద్రాబాద్ యశోధ హాస్పిటల్ నుంచి అంబులెన్సులో దుబ్బాకకు చేరుకున్న ఆయన.. వీల్ చైర్‌లో వెళ్లి ఆర్వో కార్యాలయంలో నామినేషన్ పత్రాలను సమర్పించారు. అంతకుముందు దుబ్బాక పట్టణంలో భారీ ర్యాలి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి హరీశ్ రావు, పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అక్టోబర్ 30న సిద్దిపేట జిల్లా దుబ్బాక నియోజకవర్గంలో సోమవారం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న మెదక్ ఎంపీ, బీఆర్ఎస్ దుబ్బాక అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డిపై జరిగిన హత్యాయత్నం జరిగిన విషయం తెలిసిందే. మిరుదొడ్డిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తుండగా చెప్యాల గ్రామానికి చెందిన గటాని రాజు.. ఎంపీ ప్రభాకర్‌రెడ్డిని పొత్తికడుపులో కత్తితో పొడిచాడు. దీంతో ఆయనను హుటాహుటిన గజ్వేల్ దవాఖానకు తరలించగా.. ప్రథమ చికిత్స అనంతరం అక్కడికి మెరుగైన వైద్యం కోసం సికింద్రాబాద్‌లోని యశోద దవాఖానకు తీసుకెళ్లారు. దవాఖానలో చికిత్స పొందుతున్న ఆయన గురువారం ఉదయం దవాఖాన నుంచి అంబులెన్సులో దుబ్బాకకు వెళ్లారు. పక్కా ప్లాన్‌తో హత్యాయత్నం దుబ్బాక బీఆర్ఎస్ అభ్యర్థి, మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిపై కత్తితో హత్యాయత్నానికి పాల్పడిన నిందితుడు మిరుదొడ్డి మండలం చెప్యాల గ్రామానికి చెందిన గటాని రాజుగా గుర్తించారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన రాజు ఇటీవల బీజేపీ నాయకులతో సంబంధాలు పెంచుకున్నట్లు ఆరోపణలు ఉన్నా యి. ఓపక్క రాజకీయం.. మరోపక్క యూట్యూబ్ చానల్ (వీ90 న్యూస్) రిపోర్టర్‌గా పని చేస్తున్నా డు. వివాదాస్పదుడిగా రాజుపై పలు ఆరోపణలు ఉన్నాయి. ఒక్కోచోట ఒక్కోరకంగా జర్నలిస్టునంటూ.. రాజకీయ నేతనంటూ పలువురిని బెదిరింపులకు గురిచేస్తూ డబ్బులు వసూలు చేసేవాడని స్థానికులు చెబుతున్నారు. ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డికి రాజుకు మధ్యన ఎలాంటి సంబంధాలు లేవు. ఎంపీని హత్య చేసేందుకు రాజును ఇతర రాజకీయ పార్టీల నాయకులు పురమాయించారా .. లేక పావుగా వాడుకున్నారా అనే సందేహాలు లేవనెత్తుతున్నాయి. సోమవారం దౌల్తాబాద్ మం డలం సూరంపల్లిలో ఎంపీ ప్రభాకర్‌రెడ్డి ప్రచారం ముగిసిన వెంటనే కవరేజీకి వచ్చిన స్థానిక పాత్రికేయులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. రాజు ఎంపీ ప్రభాకర్‌రెడ్డిని అనుసరిస్తూ పాస్టర్ రం గయ్య ఇంటి వద్దకు వెళ్లాడు. ఇంట్లో నుంచి బయటకు వచ్చిన ఎంపీ ప్రభాకర్‌రెడ్డిని విష్ చేస్తున్నట్లు నటిస్తూ.. రాజు తన ప్యాంట్ జేబులో దాచుకున్న కత్తితో హత్యాయత్నానికి పాల్పడ్డాడు.

## నామినేషన్ దాఖలు చేసిన బీఆర్ఎస్ అభ్యర్థి బాల్క సుమన్



చెన్నూరు,నవంబర్ 9 (సమ సమాజం): అసెంబ్లీలో ప్రభుత్వ విప్, బీఆర్ఎస్ అభ్యర్థి బాల్క సుమన్ మంచిర్యాల జిల్లా చెన్నూరులో నామినేషన్ దాఖలు చేశారు. పార్టీ కార్యక్తలు, నాయకులతో కలిసి చెన్నూరు పట్టణంలోని ఆర్వో కార్యాలయానికి వెళ్లిన సుమన్.. నామినేషన్ పత్రాలను సమర్పించారు. అంతకుముందు పట్టణంలోని శ్రీ జగన్నాథ స్వామి వారి ఆలయంలో కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా, ఎమ్మెల్యే బాల్క సుమన్ తరపున రెండో సెట్ నామినేషన్‌ను మాజీ మంత్రి బోడ జనార్దన్ చెన్నూరు పట్టణంలోని తాహసిల్దార్ కార్యాలయంలో దాఖలు చేశారు. ఆయనవెంట చెన్నూరు మార్కెట్ కమిటీ చైర్మన్ దామోదర్ రెడ్డి, వైస్ చైర్మన్ భైస ప్రభాకర్, సీనియర్ నాయకులు రిక్కుల మధుకర్, రామ్ లాల్ ఉన్నారు. నామినేషన్ దాఖలు చేయడానికి ముందు చెన్నూరు పట్టణంలోని శ్రీ జగన్నాథ స్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారి ఆశీస్సులు పొందడం జరిగింది.

# సిరిసిల్ల ప్రజలు తల ఎత్తుకునేలా చేశా మంత్రి కేటీఆర్




రాజన్న సిరిసిల్ల, నవంబర్ 9 (సమ సమాజం): నాకు రాజకీయ భిక్షని ప్రసాదించిన నియోజకవర్గం సిరిసిల్ల. సిరిసిల్ల ప్రజల ఆశీర్వాదంతోనే గెలిచి సిరిసిల్ల అభివృద్ధి చేసాను అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ అన్నారు. సిరిసిల్ల నియోజకవర్గం నుంచి ఎన్నికల బరిలో ఉన్న కేటీఆర్ తన నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారికి సమర్పించారు. సిరిసిల్ల నుంచి కేటీఆర్ ఐదోసారి బరిలో నిలిచారు. నామినేషన్ దాఖలు కంటే ముందు కేటీఆర్ ప్రగతి భవన్‌లో ప్రత్యేక పూజలు చేసిన సంగతి తెలిసిందే. అనంతరం ఆయన మాట్లాడుతూ..సిరిసిల్ల జిల్లా ప్రజలు తల ఎత్తుకునే విధంగా పనిచేసాను. ఎట్లుండే సిరిసిల్ల ఇప్పుడు ఎలా అయిందనేది ఆలోచన చేయాలన్నారు. రాష్ట్రంలో సిరిసిల్ల అభివృద్ధిలోనే ముందున్నది. కేసీఆర్ ఆశీర్వాదంతో తొమ్మిది ఏండ్లు మంత్రిగా పనిచేసాను. గౌరవ మెజారిటితో తిరిగి గెలిపిస్తారని నమ్మకం ఉందన్నారు. తానే క్యాండెట్ అనే విధంగా ప్రజలు నాలుగుసార్లు గెలిపించారు. ఇంటింటికి ప్రగతి నివేదికలు పంపుతామన్నారు. నేను సిరిసిల్లకి ఏం చేసాను, కాంగ్రెస్, బీజేపీ ఏం చేశాయో చూడాలన్నారు. రాజీలేని పోరాటం చేస్తున్న కేసీఆర్ పై కాంగ్రెస్, బీజేపీ దండయాత్ర కు వస్తున్నాయని మండిపడ్డారు. గుజరాతీ వారు దండయాత్ర చేయడానికి వస్తే ఊరుకుందమా? చేవలెని, సాతగాని వాళ్లు బీజేపీ, కాంగ్రెస్ నాయకులు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కరెంటు కావాలా, కాంగ్రెస్ కావాలా..కన్నీళ్ళు కావాలా..నీళ్లు కావాలో ప్రజలు తేల్చుకోవాలన్నారు. సీఎం కేసీఆర్ ఎన్నడూ కులం, మతం పేరుతో కుంపట్లు పెట్టలేదని గుర్తు చేశారు. ఎన్నికలు రాగానే కులం, మతం అంటున్నారు. కులపిచ్చి, మతపిచ్చి ఉన్న నాయకులు మనకు అవసరమా? అని సూటిగా ప్రశ్నించారు. ఢిల్లీ వాడు వచ్చి దండయాత్ర చేస్తుంటే ఊరుకుందమా? తాత్కలిక పైసలు, మందుకు లొంగిపోతే దీర్ఘకాలం బాధపడుతామన్నారు. తెలంగాణ గొంతుక పోగొట్టుకుంటే మల్లీ బాధపడాల్సి వస్తదని ఇంటి పార్టీ బీఆర్ఎస్‌ను గెలిపించుకుంటే కష్టాలు తీరుతాయన్నారు.

## మల్లారెడ్డికి కారు లేదు.. విక్రమార్కకు అప్పులు లేవు





హైదరాబాద్, నవంబర్ 9 (సమ సమాజం): అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ ప్రక్రియలో భాగంగా ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులు పెద్ద సంఖ్యలో అఫిడవిట్లు సమర్పించారు. బీఆర్ఎస్ ప్రస్తుత ఎమ్మె ల్యేలు, మంత్రులు, కాంగ్రెస్ ప్రస్తుత ఎమ్మెల్యేలు, ఇతర పార్టీ సీనియర్ నాయకులు తమ ఆస్తులు, కేసుల వివరాలను వెల్లడించారు. మేడ్చల్ నియోజకవర్గం నుంచి భారత రాష్ట్ర సమితి పార్టీ అభ్యర్థి గా పోటీచేస్తున్న కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి తనకు రూ.95 కోట్లకుపైగా ఆస్తులున్నట్టు పేర్కొన్నప్పటికీ.. చేతిలో ఒక్క రూపాయి నగదు లేదని, తనకు కారు కూడా లేదని అఫిడవిట్లో పొం దుపరిచారు. మంత్రి గంగుల కమలాకర్ పలు సంస్థల్లో వ్యాపార భాగస్వామ్యం ఉన్నట్లు పొందుపరిచారు. ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ చాంద్రాయణ గుట్ట నియోజకవర్గం నుంచి నామినేషన్ దాఖలు చేశారు. మొత్తం 6 కేసులు, రూ.18.77 కోట్ల ఆస్తులు, రూ.5.99కోట్ల అప్పులు ఉన్నా యని పేర్కొన్నారు. మధిర కాంగ్రెస్ అభ్యర్థి భట్టివిక్రమార్క తన అఫిడవిట్‌లో రూ.8.12 కోట్ల ఆస్తు లున్నాయని, అప్పులేవీ లేవని తెలిపారు. నాగర్‌కర్నూలు భారాస అభ్యర్థి మర్రి జనార్దన్‌రెడ్డి రూ.112.23 కోట్లు ఆస్తులున్నాయి. కోరుట్ల నుంచి భాజపా అభ్యర్థిగా పోటీచేస్తున్న ధర్మపురి అర్వింద్ తనపై 17 కేసులతో పాటు రూ.107.43 కోట్ల ఆస్తులున్నాయని వెల్లడించారు.

## ఎన్నికల రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు అందజేసిన మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి



నిర్మల్,నవంబర్ 9 (సమ సమాజం): మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి నిర్మల్ బీఆర్ఎస్ అభ్యర్థిగా అట్టహాసంగా నామినేషన్ దాఖలు చేశారు. నిర్మల్ ఆర్డీవో కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు అందజేశారు. నామినేషన్ దాఖలు కంటే ముందు మంత్రి తన నివాసంలో ప్రత్యేక పూజలు చేశారు. నిర్మల్ నియోజకవర్గంలోని ఆయా గ్రామాల నుంచి పెద్దఎత్తున బీఆర్ఎస్ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు. నిర్మల్ పట్టణం ఎటు చూసినా గులాబీమయంగా మారింది. అడుగడుగునా ప్రజలు మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డికి అపూర్వ స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## కొల్లాపూర్‌లో నామినేషన్ వేసిన బర్రెలక్క




కొల్లాపూర్, నవంబర్ 9 (సమ సమాజం): తనపై కేసు పెట్టడంతో నిరసనగా నిరుద్యోగుల తరపున కొల్లాపూర్ నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీలో ఉంటున్నట్లు కర్నె శిరీష అలియాస్ బర్రెలక్క పేర్కొన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం మరికల్ గ్రామానికి చెందిన శిరీష బుధవారం కొల్లాపూర్‌లో రిటర్నింగ్ అధికారి కుమార్‌దీపక్‌కు స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ అందజేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు... రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య తీవ్రతను తెలి పేలా బర్రెలను కాస్తూ వీడియో తీసి యూట్యూబ్, సోషల్‌మీడియాలో పోస్టు చేసినందుకు తనపై పోలీసులు కేసు నమోదు చేశారన్నారు. వారి తీరుపై నిరసనగా నిరుద్యోగుల వాణి వినిపించడానికే ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

# కామారెడ్డిలో రోజుకో కొత్త సమస్య

**కెసిఆర్ పోటీతో పెరుగుతున్న అసంతృప్తి ◆ మొన్నటి వరకు కామారెడ్డి మాస్టర్ ప్లాన్ ◆ తాజాగా తెరపైకి నిజాం షుగర్స్ ఫ్యాక్టరీ**

**కామారెడ్డి, నవంబర్ 9 (సమ సమాజం):** గజ్వేల్‌లో సిఎం కెసిఆర్ గెలుపు ఖాయమని, అక్కడ ఎవరూ ఆయనను ఓడించలేరన్న ప్రచారం ఉంది. అందుకు తగ్గట్లుగానే కెటిఆర్, హరీష్ రావులు ప్రచారం చేస్తున్నారు. అయినా కామారెడ్డిలో పోటీ చేయాల్సిన అవసరం,ఖర్మ ఎందుకొచ్చిందన్న అనుమానాలు కూడా ఉన్నాయి. దీనికి ఇప్పటి వరకు సరైన సమాధానం లేదు. కెసిఆర్ కామారెడ్డిలో గెలిస్తే భూమలు ధరలు పెరుగు తాయన్న వాదనను కెటిఆర్ తెచ్చారు. కెసిఆర్ నియోజకవర్గం అయితే అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతుం దన్నారు. ఇదికూడా పెద్దగా నమ్మశక్యంగా లేదు. ఈక్రమంలో ప్రత్యర్థులు కూడా కెసిఆర్‌కు వ్యతిరేకంగా వ్యూహాలు పన్నుతున్నారు. కామారెడ్డి మాస్టర్ ప్లాన్ బాధితుల తరపున నామినేషన్లు వేసేందుకు సిద్దమయ్యారు. వారందరినీ కెటిఆర్ పిలిచి మాట్లాడారు. ఇప్పుడు తెరపైకి కొత్త అస్త్రాన్ని తెస్తున్నారు. అదే నిజాం షుగర్స్ ఫ్యాక్టరీల అంశం. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలకు ఇది ప్రచారాస్త్రంగా మారింది. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రధాన ప్రతిపక్ష పార్టీలైన కాంగ్రెస్, బీజేపీలు తాము అధికారంలోకి వస్తే వంద రోజుల్లో మూత పడ్డ నిజాం షుగర్స్ ఫ్యాక్టరీలను స్వాధీనం చేసుకుని ప్రభుత్వం ఆధ్వర్యంలో నడిపిస్తామని హామీలు ఇస్తున్నాయి. గతంలో కేసీఆర్ మాట ఇచ్చి తప్పారని గుర్తు చేస్తున్నారు. అయితే బీఆర్ఎస్ పార్టీ మాత్రం ఈ విషయంలో నోరు విప్పడం లేదు. తమది రైతు ప్రభుత్వమని, రైతులకు ఎవరూ చేయనంత మేలు చేశామని చెప్పుకుంటున్న కేసీఆర్ షుగర్ఫ్యాక్టరీలను ఎందుకు తెరిపించడం లేదని కాంగ్రెస్, బీజేపీలు ప్రశ్నిస్తున్నాయి. మెదక్, కామారెడ్డి, జగిత్యాల జిల్లాల్లో వీటినే ప్రచారాస్త్రాలుగా మలుచుకున్నాయి. అధికారంలోకి వస్తే వంద రోజుల్లోనే ఫ్యాక్టరీలను స్వాధీనం చేసుకుని ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిపిస్తామని హామీ ఇచ్చి గద్దెనెక్కాక మొత్తానికే మూత పడేలా చేశారని ఆరోపిస్తున్నాయి. వేలాది మంది రైతులకు తీరని నష్టం కలిగించడంతోపాటు, వందలాది కార్మికులను రోడ్డున పడేశారని విమర్శిస్తున్నాయి. నిజాం షుగర్స్? ఫ్యాక్టరీలను సర్వనాశనం చేసిన బీఆర్ఎస్?కు రైతులు గుణపాఠం చెప్పాలని కోరుతున్నాయి. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఫ్యాక్టరీలను తిరిగి తెరిపించేలా చర్యలు తీసుకుంటామని చెబుతున్నాయి. కాగా, ఫ్యాక్టరీల గురించి ఏం మాట్లాడినా అది తమకు మైనస్ అవుతుందని భావిస్తున్న బీఆర్ఎస్ ఎక్కడా ఈ అంశాన్ని ప్రస్తావించడం లేదు. కామారెడ్డి జిల్లా బోధన్ సమీపంలోని శక్కర్ నగర్, జగిత్యాల జిల్లా మెట్‌పల్లి, మెదక్ జిల్లా మెదక్ మండలం మంబోజిపల్లిలోని నిజాం షుగర్ ఫ్యాక్టరీలు 2002 సంవత్సరం వరకు బాగానే నడిచాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో టీడీపీ ప్రభుత్వం నష్టాల సాకుతో 2002లో ఫ్యాక్టరీలను ప్రైవేటీకరించింది. జాయింట్ వెంచర్‌గా ఫ్యాక్టరీలను నిర్వహించేందుకు డెల్టా పేపర్ మిల్ యాజమాన్యానికి అప్పగించింది. భూములను తెగనమ్మారు. 2004 సంవత్సరంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన శాసనసభా సంఘం ఫ్యాక్టరీల స్థితిగతులు పరిశీలించి, చెరుకు రైతులు, కార్మికులతో మాట్లాడింది. ప్రైవేటీకరణ ఒప్పందాన్ని రద్దుచేసి ఫ్యాక్టరీలను తిరిగి ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని 2008లో నివేదిక సమర్పించింది. అయితే ఇది అమలుకు నోచుకోలేదు. తెలంగాణ ఏర్పాటైన తర్వాత 2014 అసెంబ్లీ ఎన్నికలప్పుడు టీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడితే వంద రోజుల్లో ఫ్యాక్టరీలను ప్రభుత్వ స్వాధీనం చేసుకొని పూర్వవైభవం తీసుకువస్తామని కేసీఆర్ ప్రకటించారు. ఎన్నికల్లో విజయం సాధించి టీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత 2015 ఆరంభంలో ఫ్యాక్టరీల స్వాధీన ప్రక్రియ చేపట్టాలని సీఎం అధికారులకు ఆదేశాలు కూడా జారీ చేశారు. ఈ క్రమంలో ప్రభుత్వం ఫ్యాక్టరీల స్వాధీనానికి చర్యలు మొదలుపెట్టినా అడుగు ముందుకు పడలేదు. మూతపడి ఎనిమిదేండ్లవుతుండడంతో వినియోగంలో లేక ఫ్యాక్టరీల్లోని మెషినరీ తుప్పుపట్టి పాడైపోయింది. పెద్ద పెద్ద గోడౌన్లు వృథాగా మిగిలాయి. ఉద్యోగులు, కార్మికులు నివసించేందుకు నిర్మించిన బంగ్లాలు, క్వార్టర్లు, గెస్ట్‌హౌజ్‌లు శిథిలమవుతున్నాయి. ఫ్యాక్టరీ ఆవరణల్లో తుమ్మ చెట్లు మొలిచి చిన్నపాటి అడవులను తలపిస్తున్నాయి. సుమారు రూ.500 కోట్లకు పైగా విలువైన వందలాది ఎకరాల భూములు ఎందుకు పనికి రాకుండా పోయాయి. ఫ్యాక్టరీలు మూతపడడంతో ఉద్యోగాలు పోయి, ఉపాధి దొరక్క ఎంతోమంది కార్మికులు చెట్టుకొకరు పుట్టకొకరు అన్నట్టు బతుకు దెరువుకోసం వలస బాట పట్టారు. మనోవేదనతో కొందరు కార్మికులు గుండెపోటుతో, మరికొందరు అనారోగ్యంతో కన్నుమూశారు.

# నువ్వికా మాజీ సీఎంవే..

**మై డియర్ కల్వకుంట్ల కమీషన్ల రావు**
**నువ్వు ఏం చేశావని బీఆర్ఎస్ కు ఓటేయాలి**
**కుంగిపోయిన కాళేశ్వరం చూద్దామంటే రావు**
**మహేశ్వరం పాకిస్తాన్ లో ఉందా**
**రజాకార్ల రాజ్యమనుకుంటున్నారా**
**బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్**



**హైదరాబాద్, నవంబర్ 9 (సమ సమాజం):** మై డియర్ కల్వకుంట్ల కమీషన్ రావు. నువ్వు ఏం చేశావని బీఆర్ఎస్ కు ఓటేయాలి? కుంగిపోయిన కాళేశ్వరం చూద్దామంటే రావు 317 వల్ల చనిపోయిన ఉద్యోగ కుటుంబాల దగ్గరికి రావూ టీఎస్పీఎసీ పేపర్ లీకేజీతో వల్ల నష్టపోయిన విద్యార్థుల దగ్గరికి రావూ ఉద్యోగుల సమస్యలపై చర్చలకు రావుపోడు పట్టాల కోసం పోలీస్ దెబ్బలు తిన్న గిరిజన బిడ్డల దగ్గరికి రావు అసలు నువ్వు ఫాంహౌజ్ విడిచి రానే రావు మరి నీకెందుకు ఓటేయాలి. అందుకే చెబుతున్నా. వచ్చే ఎన్నికల్లో నువ్వు అధికారంలోకి రావు.. రావు రావురానేరావు.రాసిపెట్టుకో"అంటూ బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్ జోస్యం చెప్పారు. ఖానాపూర్ అసెంబ్లీ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థిగా రమేశ్ రాథోడ్ నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా జన్నారంలో "సింహగర్జన" పేరుతో నిర్వహించిన బహిరంగ సభకు బండి సంజయ్ కుమార్ హాజరయ్యారు. వేలాది మంది ప్రజలు ఈ సభకు తరలివచ్చారు. జై బీజేపీ. జైజై బండి సంజయ్.. భారత మాతాకీ జై, హిందూ టైగర్ జిందాబాద్ అంటూ చేసిన నినాదాలతో ఆ ప్రాంతమంతా మారుమోగిపోయింది. సీఎం సీఎం అంటూ పదేపదే నినాదాలు చేస్తున్న కార్యకర్తలను బండి సంజయ్ వారించారు. పార్టీ నాయకత్వం ఆదేశాల మేరకు బీసీని సీఎం చేయడమే లక్ష్యంగా పని చేయాలని కోరారు. ఈ సందర్భంగా పలువురు బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు చెందిన నాయకులు బండి సంజయ్ సమక్షంలో బీజేపీలో చేరారు. అంతకుముందు ప్రజలను ఉద్దేశించి బండి సంజయ్ ప్రసంగించారు.. ముఖ్యాంశాలు ఖానాపూర్ రమేశ్ రాథోడ్ కంచుకోట. రాథోడ్ గెలుపు పక్కా బీఆర్ఎస్ నేతల ముఖాలు ఇక్కడ చెల్లడం లేదు. కాంగ్రెస్ కాసులకు అమ్ముడుపోయే పార్టీ. పొరపాటున రెండు పార్టీలు అధికారంలోకి వస్తే కొద్దిరోజుల్లోనే ఆ ప్రభుత్వాలు కూలిపోతాయి. ఎందుకంటే కాంగ్రెస్ లో సీఎం సీటు కొట్లాట మొదలైతది. బీఆర్ఎస్ లో కేటీఆర్ సీఎం అయితే ఆ పార్టీలో ఎవరూ మిగలరు. రాష్ట్రంలో సుస్థిర పాలన కొనసాగాలన్నా పదేపదే ఎన్నికలు రాకుండా నివారించాలన్నా బీజేపీ అధికారం రావాల్సిన అవసరం ఉంది.ఏ సర్వే చూసినా బీఆర్ఎస్ ఓడిపోతుందని తెలియడంతో కేసీఆర్ దుష్టపన్నాగాలు పన్నుతున్నారు. కాంగ్రెసోళ్లకు పైసలిచ్చి గెలిపించుకోవాలని చూస్తున్నారు. కేసీఆర్ ఎన్ని చేసినా డిసెంబర్ 3న కేసీఆర్ మాజీ ముఖ్యమంత్రి కాబోతున్నరు. వాస్తవాలు మాట్లాడుతుంటే కేసీఆర్ కొడుకు అడ్డగోలుగా మాట్లాడుతున్నడు. అమెరికాలో నెలకు కోటి రూపాయల జీతం తీసుకునేవాడట.. అమెరికాలో చిప్పలు కడిగేటోడికి కోటి రూపాయలు ఎవరిస్తారు? మీ అయ్య లేకుండా నిన్ను కుక్కలు కూడా దేఖవ్. నెలకు కోటి సంపాదించానని చెప్పి అధికారంలోకి వచ్చాక లక్ష కోట్ల ప్రజాధనాన్ని దోచుకున్న సంగతి ఎందుకు చెప్పడం లేదు? రాష్ట్రాన్ని లూటీ చేసి ప్రాజెక్టుల పేరుతో కమీషన్లు దొబ్బి తెలంగాణను అప్పులపాల్జేసిండు. పుట్టబోయే బిడ్డపై కూడా లక్షన్నర రూపాయల అప్పు చేసిండు.. కేసీఆర్ దుష్టపాలన పుణ్యమా అని జీతాలిచ్చే పరిస్థితి లేదు. నిన్న సీఎం అంటున్నడు.. గిరిజనేతరులకు పోడు పట్టాలిస్తాడట సిగ్గుండాలే.. ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్న గిరిజనులకు పోడు పట్టాలే ఇవ్వలేదు. కొత్తగా గిరిజనేతరులకు పట్టాలిస్తామని చెబుతూ గిరిజన, గిరిజనేతర ప్రజల మధ్య కొట్లాట పెట్టాలని కేసీఆర్ కుట్ర చేస్తున్నడు.అన్నా మీ పక్షాన కేసీఆర్ ప్రభుత్వంపై యుద్దం చేసిన. లాఠీదెబ్బలు తిన్న. రక్తం చిందించిన. నాపై దాడి చేసినా భయపడలే. కేసులు పెట్టినా, జైలుకు పంపినా బెదరలే మీ కోసం కొట్లాడితే నాపై ఒకటి కాదు రెండు కాదు.. ఏకంగా 74 కేసులు పెట్టిర్రు. కోర్టుల చుట్టూ తిప్పుతున్నరు. అయినా భయపడతనా? కాషాయ జెండా పట్టుకుని మీకోసం కొట్లాడుతూనే ఉంటా. పేదల రాజ్యం తీసుకొచ్చేదాకా పోరాడుతూనే ఉంటా. గడీల పాలనను బద్దలు కొట్టేదాకా పోరాడుతూనే ఉంటా. పోడు భూములకు పట్టాల కోసం కొట్లాడిన పార్టీ బీజేపీ. మై డియర్ కల్వకుంట్ల కమీషన్ రావు. నువ్వు ఏం చేశావని బీఆర్ఎస్ కు ఓటేయాలి? కుంగిపోయిన కాళేశ్వరం చూద్దామంటే రావు 317 వల్ల చనిపోయిన ఉద్యోగ కుటుంబాల దగ్గరికి రావూ TSPSC వల్ల నష్టపోయిన విద్యార్థుల దగ్గరికి రావూ ఉద్యోగుల సమస్యలపై చర్చలకు రావుపోడు భూముల కోసం పోలీస్ దెబ్బలు తిన్న గిరిజనుల దగ్గరికి రావూ అసలు నువ్వు ఫాంహౌజ్ విడిచి రానే రావు అందుకే చెబుతున్నా. వచ్చే ఎన్నికల్లో నువ్వు అధికారంలోకి రావు.. రావు రావురాసిపెట్టుకో రాష్ట్రంలో కాంగ్రెస్, ఎంఐఎం, బీఆర్ఎస్ పార్టీలు ఒక్కటే. మూడు పార్టీలు కుమ్మక్కై బీజేపీని దెబ్బతీసి అధికారంలోకి రావాలనుకుంటున్నయ్. నేను చెబుతున్నా కాంగ్రెస్, ఎంఐఎం కు ఓట్లేస్తే బీఆర్ఎస్ కు పడ్డట్లే గత నాలుగేళ్లుగా మీకోసం పోరాడుతున్న బీజేపీకి మద్దతివ్వాలని కోరుతున్నా. ప్రజల్లో కాంగ్రెస్ లేనేలేదు. మీడియాలో ప్రచారం తప్ప కాంగ్రెస్ కు క్యాడర్ లేనేలేదు. పాతబస్తీలోకి సభ పెట్టాలంటే ఎంఐఎం పర్మిషన్ తీసుకోవాలంటూ ప్రగల్భాలు పలికిన ఒవైసీకి డేట్, టైం ఫిక్స్ చేసి సవాల్ విసిరిన. పోలీసులు అడ్డంకులు సృష్టించినా అధిగమించా. అన్ నోన్ నెంబర్ నుండి ఫోన్ చేసి భార్యాపిల్లలను చంపుతామని బెదిరించినా భయపడలే. గుండెపోటుతో చావు అంచుదాకా పోయి వచ్చినోడిని. ఆ బెదిరింపులకు భయపడతానా? ఇక ఖానాపూర్ నియోజకవర్గం విషయానికొస్తే. కడెం ప్రాజెక్టు ఎత్తు పెంచుతామన్న హామీ ఏమైంది? గేట్లు పనిచేస్తున్నయా? వర్షమొస్తే కడెం ప్రాజెక్టు గేట్లు మూసుకుపోతాయి. ఈ ప్రాంతమంతా ముంపుకు గురైతది. కేసీఆర్ నోట్ల మన్ను పోయ.. ఎందుకీ అబద్దాలు? విదేశాల నుండి వచ్చినాయనకు ఇక్కడ బీఆర్ఎస్ టిక్కెట్ ఇవ్వడం సిగ్గు చేటు. వేములవాడలో ఇట్లనే చేస్తే గెలిచిన తరువాత పత్తా లేకుండా పోయారు. ఇక్కడా అదే జరుగుతుంది. సదర్మట్ ప్రాజెక్టును పూర్తి చేస్తే 20 వేల ఎకరాలకు నీరు అందించవచ్చు. అయినా పట్టించుకోరు. ఖానాపూర్‌లో ఇప్పటికీ డిగ్రీ కాలేజీ లేదు. పెంబి మండలానికైతే హైస్కూల్ కూడా లేదు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఖానాపూర్ మండలంలో 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని 100 పడకల సౌకర్యంగా అప్‌గ్రేడ్ చేస్తానన్న హామీ గాలికొదిలేశారు.విదేశాల నుండి వచ్చిన నాయకుడికి బీఆర్ఎస్ టిక్కెట్ ఇచ్చింది. ఖానాపూర్ సమస్యలపై కనీస అవగాహన లేదు. సిట్టింగ్ ఎమ్మెల్యే అవినీతి గురించి ప్రత్యేకంగా చెప్పడానికేముంది? కమీషన్ల ఎమ్మెల్యే అని సొంత పార్టీ నేతలు అంటున్నరు. అవినీతి కేసులో ఆమె అనుచరులు జైలుకు పోయారంటే ఏ స్థాయిలో అవినీతి ఉందో అర్థం చేసుకోవచ్చు.పెంబి మండలం పస్పుల బ్రిడ్జికి కేంద్రం 108 కోట్లను రిలీజ్ చేస్తే వాటిని సక్రమంగా ఉపయోగించుకోలేదు. గంగాపూర్ వంతెన నిర్మించిన ఏడాదిలోపే కూలిపోయింది. ఖానాపూర్ టౌన్ రోడ్డు పరిస్థితి ఏంది? 12 కి.మీల వరకు 4 లేన్ రోడ్డు చేస్తామన్నరు. మూడేళ్లయింది. ఎక్కడ చూసినా అసంపూర్తిగానే ఉంది. చివరకు 4 లేన్లు చేతగాక 2 లేన్లుగా మార్చి కటింగ్ దశలోనే ఆపేశారు. కమీషన్లన్నీ దొబ్బేశారు. ఖానాపూర్ లో 4 వేల డబుల్ బెడ్రూం ఇండ్లను నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఇంతకీ ఎంతమందికి ఇచ్చారో చేతులెత్తండి.. ఎంతమందికి దళిత బంధు వచ్చిందో? ఎంతమందికి గిరిజన బంధు వచ్చిందో? ఎంతమందికి బీసీ బంధు వచ్చిందో చెప్పాలి. బీజేపీ అధికారంలోకి వస్తే పేదలందరికీ ఇండ్లు నిర్మిస్తాం. ఉచిత విద్య, వైద్యం అందిస్తాం. రైతులకు ఫసల్ బీమా సాయం చేస్తాం. సదర్మట్ ప్రాజెక్టు ద్వారా రెండో పంటకు నీరందేలా చేస్తా. పస్పుల ప్రాజెక్టును పూర్తి చేస్తాం. కడెం ప్రాజెక్టు ఎత్తు పెంచుతాం. రమేశ్ రాథోడ్ ను బీజేపీ అభ్యర్థిగా అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరుతున్నా' అని బండి సంజయ్ వ్యాఖ్యానించారు. 'మహేశ్వరం పాకిస్తాన్ లో ఉందనుకుంటున్నరా? లేక రజాకార్ల రాజ్యమనుకుంటున్నరా? ఎంఐఎం అరాచాకాలు శ్రుతి మించినా ఎందుకు నోరు మెదపడం లేదు? గణేష్ మండపాలు ఏర్పాటు చేసుకుంటే కేసులు పెట్టి వేధిస్తున్నరు. ఛత్రపతి శివాజీ వేడుకులు చేసుకుంటే పోలీసులతో బెదిరిస్తరు. ఇక్కడ కట్టిన డబుల్ బెడ్రూం ఇండ్లను పాతబస్తీలోని ఎంఐఎం కార్యకర్తలకు పంచిపెడతరు? ఇదేం పాలన? పొరపాటున మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే బొట్టు పెట్టుకుని, కంకణం కట్టుకుని తిరిగే పరిస్థితి కూడా ఉండదు" అంటూ బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, స్టార్ క్యాంపెయినర్ బండి సంజయ్ కుమార్ పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ సర్కార్ ను బొందపెట్టి బీజేపీ ఆధ్వర్యంలో రామరాజ్యాన్ని స్థాపించుకుందామని పిలుపునిచ్చారు. మహేశ్వరం నియోజకవర్గ బీజేపీ అభ్యర్థిగా అందెల శ్రీరాములు యాదవ్ నామినేషన్ వేస్తున్న సందర్భంగా వేలాది మందితో అట్టహాసంగా జరిగిన ర్యాలీలో బండి సంజయ్ పాల్గొన్నారు. ర్యాలీలో ప్రసంగించాలని భావించినప్పటికీ హెలికాప్టర్ లో ఖానాపూర్ వెళ్లాల్సి రావడం, సమయం మించిపోవడంతో మాట్లాడలేకపోయారు.

# కొత్తగా పెళ్లైన జంటలకు రూ.1.6 లక్షల సాయం



**ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ మాదిరిగా మైనార్టీ సబ్ ప్లాన్**
**ఆరు నెలల్లో కులగణన చేపడుతాం**
**అన్ని వెనుకబడిన తరగతులకు న్యాయమైన రిజర్వేషన్లు**
**మైనార్టీ డిక్లరేషన్ ప్రకటించిన తెలంగాణ కాంగ్రెస్**

**హైదరాబాద్, నవంబర్ 9 (సమ సమాజం):** : తెలంగాణ కాంగ్రెస్ మైనార్టీ డిక్లరేషన్‌ను ప్రకటించింది. ఆరు నెలల్లో కులగణన చేపట్టి.. అన్ని వెనుకబడిన తరగతులకు న్యాయమైన రిజర్వేషన్లు కల్పిస్తామని డిక్లరేషన్‌లో వెల్లడించింది. నిరుద్యోగ మైనార్టీ యువత, మహిళలకు సబ్సిడీ రుణాలు అందించనున్నట్లు తెలిపింది. తెలంగాణలో అధికారం ఛేజిక్కించుకోవడమే లక్ష్యంగా వర్గాల వారీగా డిక్లరేషన్‌లు ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ.. తాజాగా మరో డిక్లరేషన్‌ను ప్రకటించింది. ఇప్పటికే యువ, రైతు, ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌లను ప్రకటించగా.. టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి నేడు మైనార్టీ డిక్లరేషన్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైతే.. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ మాదిరిగా మైనార్టీ సబ్ ప్లాన్ ఏర్పాటు చేసి రూ.4 వేల కోట్లు కేటాయిస్తామని రేవంత్ రెడ్డి వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనే ముస్లింలకు న్యాయం జరిగిందన్న ఆయన.. మంత్రులుగా, రాజ్యసభ సభ్యులుగా ముస్లింలకు అనేక అవకాశాలు కల్పించింది కాంగ్రెస్ ప్రభుత్వాలేనని గుర్తు చేశారు. వక్ఫ్ భూములను కాపాడే బాధ్యత కాంగ్రెస్ తీసుకుంటుందని రేవంత్ స్పష్టం చేశారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో అజారుద్దీన్‌కు టికెట్ కేటాయిస్తే.. పోటీగా ఎంఐఎం అభ్యర్థిని నిలబెట్టిందని ఆరోపించారు. కామారెడ్డిలో షబ్బీర్ అలీకి కాకుండా.. ఎంఐఎం కేసీఆర్‌కు మద్దతు ఇస్తోందని విమర్శించారు. బీజేపీ అభ్యర్థి రాజాసింగ్‌పై మాత్రం ఎంఐఎం పోటీ చేయదని మండిపడ్డారు. తెలంగాణలో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకొస్తామని శపథం చేశారు.

# మరో ఆరు నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించిన బీజేపీ



**హైదరాబాద్,నవంబర్ 9 (సమ సమాజం):** ఇప్పటికే నాలుగు జాబితాల్లో 100 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన తెలంగాణ బీజేపీ.. నేడు ఐదో జాబితాలో ఆరుగురు అభ్యర్థుల పేర్లను ప్రకటించింది. ఆ ఆరుగురు అభ్యర్థులకు ఫోన్లు చేసి టికెట్ విషయాన్ని అధిష్ఠానం చెప్పింది. అలాగే రాత్రి వరకు బీజేపీ తుది అభ్యర్థుల జాబితా వెలువడే అవకాశం ఉన్నట్లు సమాచారం. పొత్తుల్లో భాగంగా జనసేనకు 8 స్థానాలను కేటాయించింది. అయితే ముందుగా ప్రకటించిన వంద మందిలో చాంద్రాయణ గుట్ట అభ్యర్థి అనారోగ్య కారణాలతో పోటీ నుంచి తప్పుకున్నారు. దీంతో మొత్తం 12 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించాల్సి ఉండగా.. ఇప్పుడు ఆరు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించారు. ఇప్పుడు మధిర, వికారాబాద్, నర్సంపేట, అలంపూర్, దేవరకద్ర, చాంద్రాయణ గుట్ట స్థానాలకు ఇంకా అభ్యర్థులు ఖరారు కావాల్సి ఉంది.

# విమానంలో ఏపీ మహిళకు లైంగిక వేధింపులు



**హైదరాబాద్, నవంబర్ 9 (సమ సమాజం):** ఓ అంతర్జాతీయ విమానంలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 32 ఏళ్ల మహిళపై ఆమె పక్కన కూర్చొన్న తోటి ప్రయాణికుడు అసభ్యకరంగా ప్రవర్తించి లైంగిక వేధింపు లకు పాల్పడ్డాడు. ఈ నెల 6న జర్మనీలోని ఫ్రాంక్‌ఫర్ట్ నుంచి బెంగళూరుకు బయల్దేరిన లుఫ్తాన్సా విమానంలో ఈ ఘటన జరిగింది. నిందితుడిని అదుపులోకి తీసుకొన్న పోలీసులు.. ఐపీసీ సెక్షన్ 354ఏ కింద కింద కేసు నమోదు చేశారు.

# పవన్ మద్దతు కోరిన లండన్ మేయర్ అభ్యర్థి



**హైదరాబాద్, నవంబర్ 9 (సమ సమాజం):** లండన్ మేయర్ ఎన్నికల్లో పోటీ చేస్తున్న భారత సంతతికి చెందిన తరుణ్ గులాటీ హైదరాబాద్‌లో జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌ను కలిసి మద్దతు కోరారు. స్వతంత్ర అభ్యర్థిగా తాను పోటీ చేస్తున్న ప్రాంతంలో పవన్ కల్యాణ్ అభిమానులు, జన సైనికులు ఎక్కువగా ఉన్నారని గులాటీ ఈ సందర్భంగా తెలిపారు. ఈ అభ్యర్థనను పవన్కల్యాణ్ స్వాగతించినట్లు, ఆయనను అభినందించినట్లు జనసేన ఒక ప్రకటనలో వెల్లడించింది. తన అభిమానులు, జనసేన శ్రేణులు, తెలుగువారు, భారతీయులు తరుణ్ గులాటీ విజయానికి కృషి చేయాలని పవన్ కల్యాణ్ కోరినట్లు ఈ ప్రకటనలో పేర్కొంది.

# కాంగ్రెస్ వస్తే విధ్వంసమే..



**● యువతకు కాంగ్రెస్‌లో భవిష్యత్ లేదు ● మోడీ హామీలపై ప్రజలకు విశ్వాసం**
**● ఎంపీలో ప్రధాని విమర్శలు**

**మధ్యప్రదేవ్, నవంబర్ 9 (సమ సమాజం):** మధ్యప్రదేశ్ రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలకు పోలింగ్ తేదీ దగ్గర పడుతుండటంతో బీజేపీ, కాంగ్రెస్ మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. తాజాగా మధ్యప్రదేశ్ సత్నాలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ప్రధాని నరేంద్రమోడీ మరోసారి కాంగ్రెస్ పార్టీని టార్గెట్ చేస్తూ తీవ్ర విమర్శలు చేశారు. కాంగ్రెస్ పార్టీ వస్తే దానితో పాటు విధ్వంసాన్ని తెస్తుందని అన్నారు. మధ్యప్రదేశ్ అభివృద్ధికి కాంగ్రెస్‌కి రోడ్‌మ్యాప్ లేదని, మోడీ హామీలపై ప్రజలకు విశ్వాసం ఉందని ఆయన అన్నారు. రాష్ట్ర యువతకు కాంగ్రెస్‌లో భవిష్యత్ లేదని, మోడీ ఇచ్చిన హామీలపై రాష్ట్రానికి నమ్మకం ఉందని ప్రధాని మోడీ అన్నారు. రాష్ట్రంలోని ప్రజలను భాజపాకు ఓటు వేయాలని విజ్ఞప్తి చేస్తూ.. మీ ఒక్క ఓటు ఢిల్లీలో మోడీకి బలాన్ని ఇస్తుంది, మీ ఒక్క ఓటు అవినీతి కాంగ్రెస్‌ని మధ్యప్రదేశ్ నుంచి తరిమికొడుతుందని అని ఆయన అన్నారు. కాంగ్రెస్‌కి ఓటేస్తే ఉచిత రేషన్, ఉచిత వైద్యం ఆగిపోతాయని అన్నారు. గతంలో కేంద్రంలోని కాంగ్రెస్ మధ్యప్రదేవ్ బీజేపీ ప్రభుత్వానికి పనిచేయడానికి అడ్డంకులు సృష్టించింది, కాంగ్రెస్ ఎంపీని చీకట్లోకి నెట్టేసింది, ఇప్పుడు సబ్‌కా సాత్ సబ్‌కా వికాస్ సమయం ఆసన్నమైంది. దళితులు, వెనుకబడిన వారు, గిరిజనులు, పేదలు, ప్రతీ ఒక్కరూ తమ హక్కులను పొందుతారు" అని ప్రధాని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో 2జీ, బొగ్గు కుంభకోణం, కామన్వెల్త్ స్కామ్ జరిగిన విషయాన్ని ప్రధాని ప్రస్తావించారు. బీజేపీ ఈ స్కాములను ఆపింది. 10 ఏళ్లలో 10 లక్షలను పేదల ఖాతాలకు పంపింది. ఉచిత రేషన్ పథకాన్ని తాము మరో 5 ఏళ్లు పొడగించామని అన్నారు. నవంబర్ 17న రాష్ట్రంలోని 230 అసెంబ్లీ నియోజకవర్గాలకు ఓటింగ్ జరగనుంది.

# తమిళనాడులో భారీ వర్షాలు



**ఎడతెరిపి లేకుండా కురుస్తోన్న భారీ వర్షాలు**
**స్కూల్స్, కాలేజీలకు సెలవులు ప్రకటించిన అధికారులు**

**చెన్నై, నవంబర్ 9 (సమ సమాజం):** ఈశాన్య రుతుపవనాల కారణంగా తమిళనాడులో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఆ రాష్ట్ర వ్యాప్తంగాలో కురుస్తున్న వర్షాల కారణంగా ప్రజా జీవరణం అస్తవ్యస్తమవుతోంది. ఎడతెరిపి లేకుండా వానలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో తమిళనాడు ప్రభుత్వం అప్రమత్తమైంది. మరోవైపు, తమిళనాడులోని 5 రాష్ట్రాల్లో వర్షం ముంచెత్తడంతో స్కూల్స్, కాలేజీలకు అధికారులు సెలవులు ప్రకటించారు. వర్షాల నేపథ్యంలో తమిళనాడులోని కోయంబత్తూరు, నీల్‌గిరిస్, దిండిగల్, మధురై ప్రాంతాల్లో విద్యాసంస్థలను మూసి వేయవల్సిందిగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వీటితోపాటు రాష్ట్రంలోని పలు జిల్లాల్లోని విద్యాసంస్థలకు గురువారం (నవంబర్ 9) సెలవులు ప్రకటించారు. భారత వాతావరణ శాఖ IMD ప్రకారం.. తమిళనాడు రాష్ట్రంలో భారీ వర్షాలు నవంబర్ 8, 9 తేదీల్లో కూడా కొనసాగే అవకాశం ఉన్నట్లు పేర్కొంది. ఆ తర్వాత క్రమంగా వర్షాలు తగ్గుముఖం పడుతాయని తెల్పింది. కోయంబత్తూరు, నీల్జియన్, దిండిగల్ మరియు మదురైలో ఆయా జిల్లాల మేజిస్ట్రేట్‌లు జారీ చేసిన ఆదేశాల మేరకు పాఠశాలలు మూసివేయబడతాయి. ప్రస్తుతం అక్కడ తిరుపూర్, మధురై, థేనీ, దినిదిగుల్ జిల్లాల్లో కుండపోత వాన కురుస్తోంది. ఈ క్రమంలో ఆయా జిల్లాల్లోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు, కాలేజీలకు అధికారులు సెలవులు ప్రకటించారు. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వరద ప్రభావిత ప్రాంతాల్లో అధికారులు సహాయక చర్యలు చేపట్టారు. తమిళనాడులోని నీల్జియన్, కోయంబత్తూరు, కాంచీపురం, చెంగల్‌పట్టు జిల్లాల్లోని ఏకాంత ప్రదేశాలలో మోస్తరు వర్షాలతోపాటు ఉరుములు, మెరుపులతో కూడిన గాలివానలు కురుస్తాయని ప్రాంతీయ వాతావరణ కేంద్రం అంచనా వేసింది. తమిళనాడులోని చెన్నై, తిరువళ్లూరు తిరుప్పూర్ తేని, దిండుగల్, ఈరోడ్, సేలం, నమక్కల్ టెంకన్, శివగంగ మదురై, రామంతపురం, పుదుకోట్టై అరియలూర్, పెరంబలూర్, తిరుచిరాపల్లి కరూర్, తిరువణ్ణామలై, రాణిపేట్, రాణిపేట్, విల్లుపురం, కడలూరు, మైలాడుతురై, నాగపట్నం, తంజావూరు, తిరువారూర్ జిల్లాలు, పుదుచ్చేరి, కారైకాల్ తిరువళ్లూరులోని కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుండి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది. ఇక రాబోయే 24 గంటల్లో తమిళనాడు, కేరళ వ్యాప్తంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు భారత వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది.

# నామినేషన్ పత్రాలను సమర్పించిన సిఎం కేసీఆర్



**(మొదటి పేజీ తరువాయి)** పై జనాల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం కోనాయిపల్లి వేంకటేశ్వరాలయంలో సీఎం కేసీఆర్ శనివారం ప్రత్యేక పూజలు చేసిన సంగతి తెలిసిందే. నామినేషన్ వేసే ముందు ప్రతిసారి సీఎం కేసీఆర్ కోనాయిపల్లి స్వామివారి ఆశీస్సులు తీసుకోవడం ఆనవాయితీగా వస్తున్నది. ఆలయంలో తొలుత ధ్వజస్తంభానికి మొక్కి గుడి చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు నామినేషన్ పత్రాలను స్వామి వారి సన్నిధిలో పెట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు పూజలు నిర్వహించి నామినేషన్ పత్రాలను అందించి తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం సీఎం కేసీఆర్ గజ్వేల్, కామారెడ్డి శాసనసభకు వేసే(రెండు సెట్లు) నామినేషన్ పత్రాలపై సంతకాలు చేశారు. విజయాల పరంపర కోనాయిపల్లి వెంకన్నకు పూజలు చేసిన ప్రతిసారి సీఎం కేసీఆర్ కేసీఆర్‌కు విజయం వరించింది. 1985లో తొలిసారి ఎమ్మెల్యేగా గెలుపొందినప్పటి నుంచి 1989, 1994, 1999, 2001, 2004, 2009, 2014, 2018లో జరిగిన ఎన్నికల సమయంలో ఈ ఆలయంలో నామినేషన్ పత్రాలకు పూజలు చేసి, నామినేషన్ వేశారు. అన్ని సందర్భాల్లోనూ విజయం సాధించారు. మరో విశేషం ఏమిటంటే, 2001లో టీడీపీకి, శాసనసభ డిప్యూటీ స్పీకర్, ఎమ్మెల్యే పదవులకు రాజీనామా చేసి, ఆపై ఈ ఆలయంలోనే పూజలు చేసి టీఆర్ఎస్ (ప్రస్తుత బీఆర్ఎస్) పార్టీని సీఎం కేసీఆర్ ప్రకటించారు.

# రాజకీయ పార్టీలతో సీఈఓ సమీక్షా సమావేశం



**(మొదటి పేజీ తరువాయి)** నిబంధనలను వివరించారు. నామినేషన్ల స్క్రూట్నీ, ఉపసంహణ, తుది జాబితా, గుర్తుల కేటాయింపు సంబంధించిన వివరాలు వెల్లడించారు అధికారులు. రాష్ట్రంలో రాజకీయ పార్టీలు ప్రచారం కోసం ఎన్నికల సంఘానికి నలుగురికి మించకుండా స్టార్ క్యాంపెనర్స్ లిస్ట్ ఇవ్వాలని ఆయా పార్టీలను కోరింది EC. అదే విధంగా మేనిఫెస్టో వివరాలను మూడు రోజుల్లోనే CEO కార్యాలయానికి అందించాలని కోరింది. ఇక ఎన్నికల ప్రచారానికి కావాల్సిన అనుమతులు సువిదా పోర్టల్ ద్వారానే దరఖాస్తు చేసుకోవాలని సూచింది EC. అయితే షెడ్యూల్ వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు దాదాపు 11వేల అనుమతులు ఇచ్చినట్లు తెలిపారు అధికారులు. ఇక E-PIC కార్డుల పంపిణీ ఇప్పటికే 33లక్షలు పంపిణీ చేశారని, మరో 8లక్షల కార్డులను పంపిణీ చేస్తామని వికాస్ రాజ్ పేర్కొన్నారు. అదే విధంగా ఓటర్ స్లిప్ పంపిణి 10వ తేదీ నుంచి చేస్తున్నట్లు ప్రకటించారు. ECI స్పెషల్ కంప్లయింట్ బాక్స్ అయిన C-VIGIL యాప్ ద్వారా 3వేలకు పైగా ఫిర్యాదులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. అందులో ఇప్పటికే 2వేల వరకు వివరణ, యాక్షన్ తీసుకున్నట్లు EC స్పష్టం చేసింది. ఇక సీఈఓ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ అయ్యాక బీజేపీ, BRS, కాంగ్రెస్ పార్టీలు రిటర్నింగ్ అధికారులపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ సీఈఓ కు ఫిర్యాధు చేశాయి. నామినేషన్ ప్రక్రియలో RO అధికారులు ECIనిబంధనలు పాటించడం లేదని మండిపడ్డారు. ఇక, ఎన్నికల సభల్లో రేవంత్ రెడ్డి మాట్లాడే భాషపై BRS కంప్లయింట్ చేసింది. ఇక రాష్ట్ర వ్యాప్తంగా అధికారులు BRS పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని కాంగ్రెస్ ప్రతినిధులు ధ్వజమెత్తారు. వాళ్ళపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీజేపీ ఫిర్యాదులపై EC స్పందించకపోతే ECI కి ఫిర్యాధు చేస్తామని తెలిపారు. నోటిఫకేషన్ వచ్చాక మొదటిసారి పొలిటికల్ పార్టీలతో రివ్యూ పెట్టిన EC కీలక సూచనలు ఆదేశాలు జారీ చేసింది. ECI నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అదే విధంగా పోలింగ్ కౌంటింగ్ ప్రక్రియలో అధికారులకు సహకారం అందించాలని CEO కోరారు.


# దొరల గడీలను బద్దలు కొట్టడం ఖాయం



**(మొదటి పేజీ తరువాయి)** గడీలను బద్దలు కొట్టడం ఖాయమనిపిస్తోందన్నారు. ఒకనాడు డీలర్‌గా ఉన్న ఎర్రబెల్లి దయాకర్ రావు ఇప్పుడు డాలర్ దయాకర్ రావు అయ్యారని వ్యాఖ్యలు చేశారు. ఎర్రబెల్లి దయాకర్ రావు దందాలు చేస్తే... ఝాన్సీ రెడ్డి కుటుంబం పేదలకు సేవలు చేశారని తెలిపారు. ప్రజలకు సేవ చేసేందుకు కాలేజీలు, ఆసపత్రుల కోసం 80 ఎకరాల భూమి కొంటే దయాకర్ రావు లిటిగేషన్లు పెట్టి ఇబ్బందులు పెట్టారని మండిపడ్డారు. ఝాన్సీ రెడ్డికి పౌరసత్వం రాకుండా అడ్డుకున్నార న్నారు. దయాకర్ రావు నమ్మక ద్రోహి... మిత్ర ద్రోహి అంటూ విరుచుకుపడ్డారు. శత్రువులతో చేతులు కలిపి, కుట్రలు చేసి తనను జైలుకు పంపారని.. కాంగ్రెస్ కార్యకర్తలపై దయాకర్ రావు పెట్టిన అక్రమ కేసులను ఒక్క కలం పోటుతో తొలగిస్తామన్నారు. ఈ ఎన్నికల్లో పాలకుర్తిలో ఈ దొరను... తెలంగాణలో ఆ దొరను ప్రజలు ఈ బొంద పెట్టడం ఖాయమని టీపీసీసీ చీఫ్ స్పష్టం చేశారు. మీ దగ్గర దోచుకున్న సొమ్ముతో ఎర్రబెల్లి అమెరికాలో పెట్టుబడులు పెడుతుండు. చాకలి ఐలమ్మ స్ఫూర్తిగా పాలకుర్తిలో కాంగ్రెస్‌ను గెలిపించండి. ఈ ఎన్నికలు కేసీఆర్ నలుగురు కుటుంబ సభ్యులకు... నాలుగు కోట్ల ప్రజలకు మధ్య జరుగుతున్న యుద్ధం. దొరల తెలంగాణ కావాలో.. ప్రజల తెలంగాణ కావాలో నిర్ణయించుకోండని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. కేసీఆర్‌కు సవాల్ విసురుతున్నా... 24 గంటల ఉచిత విద్యుత్ ఇస్తున్నట్లు నిరూపిస్తే.. లేకపోతే వరంగల్ ఏకాశిలా పార్కు వద్ద ముక్కు నేలకు రాస్తావా? రేవంత్ రెడ్డి వస్తే తెలంగాణను అమ్ముకుంటాడని కేసీఆర్ అంటుండు.. కేసీఆర్.. 2009లో నువ్వు సికింద్రాబాద్ ఎంపీ సీట్లు అమ్ముకున్నావ్. రాజ్యసభ సీట్లు కూడా అమ్ముకున్న దుర్మార్గుడివి నువ్వు. కోకాపేట భూములు అమ్ముకున్నది నువ్వు. నమ్మకం అంటే కాంగ్రెస్.. అమ్మకం అంటే బీఆర్ఎస్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్, బీజేపీలపై టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి మండిపడ్డారు. తాను జైలుకెళ్లడానికి ఎర్రబెల్లి దయాకర్ రావే కారణమని మండిపడ్డారు. కాంగ్రెస్ నేతల ఇళ్లు, కార్యాలయాలపై ఐటీ దాడుల నేపథ్యంలో రేవంత్ రెడ్డి ఘాటుగా స్పందించారు. ఐటీ దాడులకు కాంగ్రెస్ భయపడేది లేదన్నారు. పాలేరు అభ్యర్థి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై ఐటీ అధికారులు పెద్దఎత్తున దాడులు చేస్తూ భయపెట్టాలని చూస్తున్నారన్నారు. ఇది బీఆర్ఎస్, బీజేపీ కలిసి చేస్తున్న రాజకీయ కుట్రగా అభివర్ణించారు. ఇలాంటి రాజకీయ బెదిరింపులకు కాంగ్రెస్ నాయకులు భయపడబోరని తెలిపారు. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి రాష్ట్ర కాంగ్రెస్ అంతా అండగా ఉంటుందన్నారు. ఓటమి భయంతోనే బీఆర్ఎస్, బీజేపీ కలిసి కుట్ర రాజకీయాలు చేస్తున్నాయన్నారు. ఒక్క కాంగ్రెస్ నాయకులను ఐటీ టార్గెట్‌గా చేసుకొని దాడులు చేస్తోందన్నారు. గత వారం రోజుల నుంచి కాంగ్రెస్ నాయకుల ఇళ్లల్లో మాత్రమే ఐటీ దాడులు చేస్తూ భయభ్రాంతులకు గురి చేయాలని చూస్తోందన్నారు. బీఆర్ఎస్, బీజేపీ కలిసి చేస్తున్న కుట్ర రాజకీయాలను ప్రజలు అన్నీ గమనిస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికలలో ఈ రెండు పార్టీలకు ప్రజలు తగిన బుద్ధి చెబుతారని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

# రాహుల్,వరుణ్ గాంధీల భేటి





**(మొదటి పేజీ తరువాయి)** ప్రధాని అయ్యారు. ఆయన మరణం తరవాత సోనియా, ఇప్పుడు రాహుల పార్టీకి పెద్దదిక్కుగా మారారు. సంజయ్ మరణం తరవాత ఆయన భార్య మేనకాగాంధీకి కాంగ్రెస్‌లో తావులేకుండా పోయింది. ఇప్పుడు మేనక, ఆమె తనయుడు వరుణ్ గాంధీలు బిజెపిలో ఎంపిలుగా ఉన్నా..పెద్దగా ప్రాధాన్యం లేని నేతలుగా ఉన్నారు. సొంతపార్టీ తీరుపైనే వరుణ్ గాంధీ విమర్శలు సంధిస్తున్నారు. ఈ క్రమంలో అనూహ్యంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, భాజపా ఎంపీ వరుణ్ గాంధీ మంగళవారం కేదార్‌నాథ్‌లో కలుసుకోవడం ఆసక్తికర చర్చకు దారితీసింది. భాజపాకు దూరంగా ఉంటున్న వరుణ్– పార్టీ మారే అవకాశం ఉందన్న వార్తల నేపథ్యంలో ఈ పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది. వరుణ్ గాంధీ కాంగ్రెస్‌లోకి వస్తారని అనేకసార్లు వార్తలు రాగా తాజా భేటీతో అవి మరోసారి ఊపందుకున్నాయి. ఆయన తృణమూల్ కాంగ్రెస్‌లోకి వెళ్లే అవకాశం ఉన్నట్లు కూడా వినవస్తోంది. ప్రస్తుతం వరుణ్ గాంధీ పీలీభీత్ ఎంపీగా, ఆయన తల్లి మేనకా గాంధీ సుల్తాన్‌పుర్ ఎంపీగా కొనసాగుతున్నారు. కాంగ్రెస్ మాజీ అధినేత్రి సోనియా గాంధీ, మేనకా గాంధీ తోడికోడళ్లే అయినా వారిమధ్య అంతగా సఖ్యత లేదు. రాహుల్ కంటే వరుణ్ పదేళ్లు చిన్న. వీరిద్దరి మధ్య సుహృద్భావం ఉంది. 2011లో వరుణ్ తన వివాహానికి రావాల్సిందిగా రాహుల్‌ను స్వయంగా ఆహ్వానించారు. దానికి సోనియా, రాహుల్ హాజరుకాలేదు. వరుణ్, మేనకా గాంధీలను కాంగ్రెస్ పార్టీలోకి తీసుకోవడంపై సోనియా, రాహుల్ గాంధీలే ఒక నిర్ణయం తీసుకుంటారని పార్టీ నేతలు చెబుతున్నారు. రాహుల్, వరుణ్ భేటీ అనుకోకుండా జరిగిన ఓ సమావేశం. రాజకీయాల్లో ఏదైనా సాధ్యమే. వీరిద్దరూ మాట్లాడుకోవాలనుకుంటే మతపరమైన ప్రదేశాల్లో కాకుండా వేరే ప్రాంతాల్లో కలిసేవారు. వరుణ్– భాజపాకి వ్యతిరేక వైఖరి తీసుకోవడం వల్లే ఊహాగానాలు వస్తున్నాయి. కాంగ్రెస్‌లో ఆయన చేరికపై నిర్ణయం తీసుకునేది గాంధీ కుటుంబం మాత్రమే నని అందరికీ తెలిసింది. కేంద్రంలో అధికారాన్ని దక్కించుకోవాలంటే కీలకమైన ఉత్తర్‌ప్రదేశ్‌లో సత్తా చాటడం తప్పనిసరి. 80 లోక్‌సభ స్థానాలున్న ఉత్తర్‌ప్రదేశ్‌పై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ అందుకే ప్రత్యేకంగా దృష్టి సారించారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ కేవలం ఒక్క స్థానాన్ని గెలుచుకుంది. 2022 అసెంబ్లీ ఎన్నికల్లోనూ 2 ఎమ్మెల్యే సీట్లతో సరిపెట్టుకుంది. ఈ పరిస్థితుల్లో కీలకమైన యూపీలో పార్టీని బలోపేతం చేసేందుకు కాంగ్రెస్ నడుం బిగించింది. మాజీ మంత్రి అజయ్ రాయ్‌ను పీసీసీ అధ్యక్షుడిగా ప్రకటించింది. ఎస్పీ, బీఎస్పీకి చెందిన అనేకమంది నేతలను పార్టీలోకి చేర్చుకుంది. 'రాహుల్, వరుణ్ కలుసుకోవడంలో ఎలాంటి తప్పు లేదు. పార్టీ మార్పు వార్తలపై, భవిష్యత్తు కార్యచరణపై వరుణ్ స్పందించాల్సి ఉంది.

# జమ్ము కశ్మీర్‌లో ఎన్‌కౌంటర్.. ఉగ్రవాది హతం



**(మొదటి పేజీ తరువాయి)** ర్జాతీయ సరిహద్దుల వద్ద జరిగిన కాల్పుల్లో ఓ జవాన్ గాయపడ్డారు. కాల్పుల విరమణ ఒప్పం దా న్ని ఉల్లంఘిస్తూ పాకిస్థాన్ సైన్యం కాల్పులకు తెగబడింది. దీంతో సరిహద్దు భద్రతా దళానికి చెందిన ఓ జవాన్ తీవ్రంగా గాయపడ్డారని అధికారులు తెలిపారు.

# సారీ చెప్పిన బీహార్ సీఎం నితీష్ కుమార్

**(మొదటి పేజీ తరువాయి)** ఉద్దేశం. అంతే తప్ప..ఎవర్నో కించపర్చాలన్నది నా ఉద్దేశం కాదు' అంటూ నితీశ్ వివరణ ఇచ్చుకున్నారు. ఇదిలా ఉండగా, ఆయనకు వ్యతిరేకంగా ముజఫర్‌పూర్ కోర్టులో ఫిర్యాదు నమోదైంది. దీనిపై ఈనెల 25న కోర్టు విచారణ చేపట్టబోతున్నది. సీఎం నితీశ్‌పై కఠినమైన చర్య తీసుకోవాలని డిమాండ్ చేస్తూ 'జాతీయ మహిళా కమిషన్' బీహార్ అసెంబ్లీ స్పీకర్‌కు లేఖ పంపింది. బీహార్ అసెంబ్లీలోనూ పలువురు సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. అయితే సీఎం నితీశ్ మాటల్ని వక్రీకరించకూడదంటూ ఆర్జేడీ నేత, డిప్యూటీ సీఎం తేజస్వీ యాదవ్ మద్దతు పలికారు.



ఇటీవల బీహార్‌లో నిర్వహించిన కులగణనకు సంబంధించి నివేదికను మంగళవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన సందర్భంగా నితీశ్ మాట్లాడుతూ 'భర్తల చర్యల వల్ల జననాలు పెరిగాయి. అయితే చదువుకున్న మహిళలకు తన భర్తను ఎలా నియంత్రించాలో తెలుసు. అందుకే ఇప్పుడు జననాల రేటు తగ్గుతూ వస్తున్నది' అని మాట్లాడారు.

## 97 ఏళ్ల వయసులోనూ కేసులు వాదిస్తున్నారు

**(మొదటి పేజీ తరువాయి)** తన న్యాయవాద వృత్తిని కొనసాగిస్తున్నారంటే ఎవరైనా నమ్ముతారా! ఆయన అత్యధికంగా 73 ఏళ్ల 60 రోజులు నాయ్యవాదిగా పనిచేసి, ఏకంగా గిన్నిస్ రికార్డుల కెక్కారు. ఈ రికార్డును సెప్టెంబరు 11న గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ ధ్రువీకరించింది. కేరళకు చెందిన ఈ న్యాయవాది పేరు పి.బాలసుబ్రమణియన్ మీనన్. ఇప్పుడాయనకు 97 ఏళ్లు. ప్రశాంతం గా విశ్రాంతి తీసుకోవాల్సిన ఆ వయసులో ఆయన ఇప్పటికీ కోర్టుకు హాజరై కేసుల్ని వాదిస్తున్నారు. అంత ముదిమి వయసులోనూ మీనన్ ఎప్పుడూ ఎంతో ఉత్సాహంగా కనిపిస్తూ ఉంటారు. తన కార్యాలయానికి, కోర్టుకు హాజరవుతూ క్లయింట్లను కలుస్తుంటారు. 'నాపై పూర్తి నమ్మకంతోనే ఎవ రైనా నా వద్దకు వస్తారు. అందుకే వారికోసం నా శాయశక్తులా పనిచేస్తా' అని అంటారు సుబ్రమణి యన్. మద్రాసు న్యాయ కళాశాలలో లా కోర్స్ పూర్తిచేసిన ఆయన 1950లో న్యాయవాద వృత్తిలో చేరారు. నేటికీ అదే వృత్తిలో కొనసాగటం చాలాగ్రేట్!

# కామారెడ్డిని బంగారు తునక చేస్తా



**(మొదటి పేజీ తరువాయి)** పట్టణంతోపాటు ఇక్కడి పల్లెల రూపురేఖలు కూడా మారుతయ్. చాలా అద్భుతమైన నియోజకవర్గంగా కామారెడ్డిని తయారు చేసే బాధ్యత నాది. అందుకు మీ సహకారం కావాలి. మీరు ఒకటి రెండు సార్లు బాగా ఆలోచించి ఓటేయాలి. ఎవరికి ఓటేస్తే నియోజకవర్గానికి, రాష్ట్రానికి మేలు జరుగుతదో బేరీజు వేసుకోవాలి. అంతేతప్ప ఆగమాగమై ఓటు వేయొద్దని సీఎం సూచించారు. రైతుబంధు వద్దు.. 24 గంటల కరెంటు వద్దు.. ధరణిని తీసేసి అక్కడ పడేస్తాం అని అనేటోళ్లు కావాల్నా.. ప్రజల్ని కడుపులో పెట్టుకుని చూసేటోళ్లు కావాల్నా నిర్ణయించుకోవాలని సూచించారు. కేంద్రంలోని బీజేపీ సర్కారు తెలంగాణపై కక్షగట్టి ఒక్క నవోదయ పాఠశాలనుగానీ, ఒక్క మెడికల్ కాలేజీనిగానీ ఇయ్యలేదని, మోటార్లకు మీటర్ల పెట్టేందుకు ఒప్పుకోలేదని రూ.25 వేల కోట్ల నిధులకు కోత పెట్టిందని కెసిఆర్ విమర్శలు గుప్పించారు. బీజేపీ నాయకులేమో మోటార్లకు మీటర్లు పెట్టాలని అంటుంటే.. కాంగ్రెస్ నాయకులేమో కరెంటు వద్దు రైతుబంధు వద్దు అంటున్నారని సీఎం కేసీఆర్ మండిపడ్డారు. రైతులపై కాంగ్రెస్ వైఖరి పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్‌గాంధీకి ఎవుసం.. ఎద్దు ఏమైనా తెలుసా.. నాగలి పట్టిండా.. అని ప్రశ్నించారు. నేను కాపోణ్ని, ఇప్పుడు కూడా వ్యవసాయం చేస్తా కాబట్టి రైతు బాధ తెలుసని అన్నారు. ధరణి రాకముందు రైతులకు ఎంతమంది భర్తలు ఉండేటోళ్లు. వీఆర్వో ఒక భర్త. గిరిదవారీ ఒక భర్త. తాసీల్దార్, ఆర్డీవో, జాయింట్ కలెక్టర్, కలెక్టర్, ఆయనమీద రెవెన్యూ సెక్రటరీ.. సీసీఎల్ఏ, రెవెన్యూ మంత్రి ఉండేటోళ్లు. ఇండ్ల ఎవరికి కోపం వచ్చినా.. కైలాసం ఆటల పెద్దపాము మింగినట్టే. భూమికి గోవిందా. ఎల్లయ్య భూమి పుల్లయ్యకు రాసి, పుల్లయ్యది మల్లయ్యకు రాసి.. జుట్లు ముడేసి.. వాళ్లకు తాకట్లు పెట్టి. ఆఫీసుల చుట్టు తింపి. వేలు, లక్షలు గుంజిండ్రు. వాళ్లను నాశనం పట్టిచ్చిండ్రు.' అని సీఎం కేసీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే ధరణి పోర్టల్ తెచ్చినమని స్పష్టం చేశారు. ధరణి ద్వారా భూ యాజమాన్యం మార్చేందుకు తన దగ్గర ఉన్న అధికారాన్ని ప్రభుత్వం.. రైతులకే అప్పగించిందని వివరించారు. మీరు బొటనవేలు పెడితేనే భూ యాజమాన్యం మారుతుంది తప్ప.. దాన్ని మార్చే పవర్ రాష్ట్ర ముఖ్యమంత్రికి కూడా లేదని స్పష్టం చేశారు. అలాంటి ధరణిని తీసేస్తే రైతుబంధు ఎట్ల వస్తది రైతుబీమా ఎట్ల వస్తది వడ్లు కొన్న పైసలు ఎట్ల వస్తయని సీఎం కేసీఆర్ ప్రశ్నించారు. ధరణి తీసేస్తే పాత గిరిద్వారీలు.. వీఆర్వోలు వస్తరు. అప్పుడు మల్ల ఆఫీసుల చుట్టుతిరిగే పరిస్థితి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే ధరణిని తీసి బంగాళాఖాతంలో వేస్తామని అనేటోళ్లను బంగాళాఖాతంలో వేయాలని ప్రజలకు సూచించారు. ఓటేసే ముందు పార్టీల ఫిలాసఫీ ఏంటి వాళ్ల ఆలోచన సరళి ఏంటనేది ఆలోచన చేయాలని కోరారు. తెలంగాణ ఉద్యమం అప్పుడు గిట్లనే నన్ను అగ్రతిప్పలు పెట్టింద్రు.. కాలికి పెడితే మెడకు.. మెడకు పెడితే కాలికి. ఎడ్డం అంటే తెడ్డెం అని.. అవునంటే కాదని.. ఎన్ని రకాల గోసలు పెట్టాలో అన్ని పెట్టింద్రు. చివరకు నాకు తిక్కరేగి కేసీఆర్ సచ్చుడో.. తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ శవయాత్రనా తెలంగాణ జైత్రయాత్రనా అని బయల్దేరితే.. ఎక్కడికక్కడ మీరు నరసింహులై లేస్తే.. ఊర్లన్ని ఉద్యమాలైతే.. సకల జనుల సమ్మె జరిగితే అప్పుడు దిగొచ్చి తెలంగాణ ప్రకటన చేసింద్రని అన్నారు. వెంటనే ఇచ్చింద్రా అంటే మల్ల ఏడాదిన్నర ఎగవెట్టింద్రు. సకల జనుల సమ్మె అని యావన్మంది ఉద్యోగులు, ప్రజలు, రైతులు మొత్తం రోడ్ల మీదకు వచ్చి కొట్లాడితే.. చివరకు తెలంగాణల నూకలు పుట్టకుండా అయితయని అప్పుడు ఇచ్చారని, ఇది కాంగ్రెస్ పరిస్థితి అని వివరించారు. ఎవడైతే కొనడానికి వచ్చి 50 లక్షల నగదుతో పట్టుబడ్డడో.. ఇప్పుడు ఆ మహాత్ముడే కామారెడ్డిల నామీద పోటీకొస్తడంట. ఎవరికి ఏం బుద్ధి చెప్పాల్నో మీరే నిర్ణయం చేయాలని ప్రజలను కోరారు. నాడు తెలంగాణ వచ్చేనాటికి వలసలు పోవుడు.. బతుకపోవుడు.. చెట్టుకొకలు.. పుట్టకొకలు అయినం. ఆగమాగం అయినం. ఇయ్యాళ కాపాడుకోవాలి? నిలబెట్టుకోవాలని ఐదారు పనులు చేసినం. ప్రాజెక్టుల ద్వారా చెరువులు, కాల్వలకు నీళ్లు ఇచ్చినం. మన దగ్గర నీళ్లకు ట్యాక్స్ లేదు. పాత బకాయిలు ఉంటే మాఫీ చేసినం. ఇయ్యాళ్ల కూడా ప్రాజెక్టుల ద్వారా చెరువుల కింద కానీ రఖం కట్టుడు లేదు. అదేవిధంగా కరెంటు 24 గంటలు ఫ్రీ ఇస్తున్నం. గతంలో రైతులను బాగా బాధపెట్టేది. ఇయ్యాళ ఎవడైనా కరెంటోడు వచ్చి.. రైతులను నిలదీసే పరిస్థితి లేదన్నారు. రైతుబంధు స్కీం పెట్టుకున్నం. ఎవరికైనా అపాయం జరిగితే ఆ కుటుంబం రోడ్డున పడొద్దని రైతుబీమా పెట్టుకున్నం. ధాన్యం మీ దగ్గర కొంటే ప్రభుత్వానికి డబ్బులు రావు. ఏటా 500, వెయ్యి కోట్ల నష్టం వస్తది. అయినా సరే అని చెప్పి.. మొత్తం ధాన్యం మీ ఊరికే వచ్చి కొంటున్నం. డబ్బులు కూడా వెంటనే వేస్తున్నం. యాసంగి పంట వరకు ధాన్యం డబ్బులు, రైతుబంధు వస్తున్నాయి. రెండు కలిసి పెట్టుబడికి సరిపోతున్నాయి.అప్పులు తీసుకోవాల్సిన బాధ పోతుంది. ' అని సీఎం కేసీఆర్ అన్నారు. రైతాంగాన్ని నిలబెట్టుకోవాలి.. వ్యవసాయాన్ని స్థిరీకరించాలనే పద్ధతితో ముందుకుపోతున్నమని అన్నారు. ఇలా పెన్షన్లు కావచ్చు.. అనేక సంక్షేమ కార్యక్రమాలు కావచ్చు. గొర్రెల పెంపకం కావచ్చు.. చేపల పిల్లలు కావచ్చు. ఏ వృత్తికి ఆ వృత్తి వాళ్లు పైకి రావాలని అందర్నీ ఆదుకున్నామన్నారు. 'తెలంగాణ రాకముందు మన గతి ఎట్లుండె. మన చెరువులు ఎట్లుండే. మన చెరువులు మొత్తం బోసిపోయి ఉండె. మిషన్ కాకతీయ ద్వారా చేసుకుంటే.. ఈరోజు బ్రహ్మండంగా 33వేల కోట్ల రూపాయల చేపలను తెలంగాణ ఎగుమతి చేస్తుంది. ఇలా అన్ని వర్గాలు ప్రజలను కడుపుల పెట్టుకని పోతున్నాం.' అని తెలిపారు. పదేండ్ల నుంచి శాంతిభద్రతలు ఎట్లున్నయి? ఒక్కరోజు కర్ఫ్యూ లేదు. కల్లోలం లేదు. వానలు బాగపడి కరువు కూడా లేదని అన్నారు. ఓటు వేసే ముందు అభ్యర్థిని చూడాలి.. అభ్యర్థి వెనుక ఉన్న పార్టీని చూడాలి.. ఏ ప్రభుత్వం ఏర్పడితే మంచిదో అది కూడా చూడాలని ప్రజలకు సూచించారు. కలలో కూడా అనుకోని అనేక సంక్షేమ కార్యక్రమాలను తెలంగాణలో అమలు చేస్తున్నామని సీఎం కేసీఆర్ చెప్పారు. కంటి వెలుగు అనే కార్యక్రమం ఎప్పుడైనా విన్నరా? చరిత్రల ఏ ప్రభుత్వమైనా చేసిందా? అని ప్రశ్నించారు కేసీఆర్ కిట్ పెట్టి బ్రహ్మండంగా ప్రసవాలు అన్ని ప్రభుత్వ దవాఖానాల్ల జరుగుతున్నాయి. మాతా, శిశు మరణాలు తగ్గినయ్.' అని అన్నారు. వైద్య రంగం కావచ్చు.. విద్య రంగం కావచ్చు. వ్యవసాయ రంగం కావచ్చు.. పెట్టుబడులు వస్తున్నాయి. పరిశ్రమలు వస్తున్నాయి. ఐటీ రంగం పెరుగుతుంది. అని తెలిపారు.

**Edited, Printed, Published & owned by *GOSUKONDA PRUDHVIRAJU*,** Published From, Flot n.o. 6 W.P, Sriramanuja nagar colony, Munganoor, Abdullapurmet, Rangareddy- 501511, TELANGANA,
**Printed at *Panidhar PUBLICATIONS.*** Flot n.o. 6 W.P, Sriramanuja nagar colony, Munganoor, Abdullapurmet, Rangareddy- 501511, ***Editor: GOSUKONDA PRUDHVIRAJU***,
RNI.TELTEL/2016/ 73311, Cell:8464816456 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in